ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
3
సోమవారం 8 జూలై 2024

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి (కలెక్టరేట్), జూలై 7: ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్‌తో పాటు, మండలాల ప్రజలు వారి సమస్యలను తెలియజేసేందుకు కలెక్టరేట్‌కు రావాలని తెలిపారు.

నేటి నుంచి ఉచిత ఇసుక

- ఐదేళ్లలో కుదేలైన నిర్మాణ రంగానికి ఊతం
- వినియోగదారులకు ఉపశమనం..
- వైసీపీ పాలనలో వేల కోట్ల రూపాయల దోపిడీ
- జిల్లాలో 11 డిపోలు.. 10 ఇసుక రీచ్‌లు
- అందుబాటులో 3.67 లక్షల టన్నుల ఇసుక


పెద్దతిప్పసముద్రం మండలంలో వైసీపీ నాయకులు నిల్వ చేసిన ఇసుక (ఫైల్‌ఫోటో)

(రాయచోటి- ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉదయం 6 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా ఇసుకను పంపిణీ చేయనుంది. ఐదు సంవత్సరాలుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వల్ల కుదేలైన నిర్మాణరంగానికి ఈ నిర్ణయం ఊతమివ్వనుంది. నిర్మాణరంగంలోని వినియోగదారులు, ఇళ్లు నిర్మించుకునే సామాన్య ప్రజలకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనంగా మారనుంది. నిర్మాణంలో కీలకమైన ఇసుక ఉచితంగా లభించడంతో ఇక నిర్మాణరంగం వేగం పుంజుకోనుంది. 2019 లాగే.. అన్ని వర్గాల ప్రజలకు ఇసుక ఉచితంగా దొరకనుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోన్న ఈ నిర్ణయం వల్ల జిల్లాలో భవన నిర్మాణ రంగ కార్మికులు, కూలీలు, ప్రజలకు ఎంతో మేలు కలగనుంది. దీంతో భవన నిర్మాణరంగంలోని కాంట్రాక్టర్లు, మేస్త్రీలు, కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

3.67 లక్షల టన్నుల ఇసుక..

జిల్లాలో మాండవ్యా, బాహుదా, చెయ్యేరు, పింఛా నదులు ఉన్నాయి. ఈ నదుల్లో ఇసుక లభ్యమవుతుంది. వీటితో పాటు స్థానికంగా పలుచోట్ల వాగులు, వంకల్లో కూడా ఇసుక అందుబాటులో ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఈ నదుల్లో ప్రభుత్వం గుర్తించిన 10 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఇసుకను నిల్వ చేసిన డిపోలు 11 ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం.. వీటిలో 3.67 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. నేటి ఉదయం 6 గంటల నుంచి ఈ ఇసుక ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి రానుంది. ఇసుక డిపోలు, రీచ్‌ల వద్ద వాహనంలోకి ఇసుక లోడింగ్ ఖర్చు, ప్రయాణ ఖర్చులను మాత్రమే ప్రజలు చెల్లించాల్సి ఉంటుంది. వినియోగదారులు తమ ఆధార్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లి ఇసుకను తెచ్చుకోవచ్చు. ఒక వ్యక్తి రోజుకు కేవలం 20 టన్నులు మాత్రమే తీసుకెళ్లవచ్చు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద వాహనంలోకి లోడింగ్ చేసినందుకు రూ.20 చెల్లిస్తే.. చాలు.. వినియోగదారుడు డిజిటల్ పేమెంట్ చేయాలి.

వైసీపీ పాలనలో వేల కోట్ల రూపాయల దోపిడీ

2019 వరకు తెలుగుదేశం పార్టీ పాలనలో ఇసుక ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉండేది. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోగానే.. ఇసుకపైన ఆ పార్టీ నాయకుల కన్ను పడింది. సాక్షాత్తు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు. చిన్నపెద్ద నాయకులు ఇసుకను ఆదాయ వనరుగా చేసుకున్నారు. ఇందుకు జగన్ ప్రభుత్వం కూడా ఇతోధికంగా సాయం చేసింది. ఫలితంగా ఐదు సంవత్సరాల పాటు..ఇసుక ధరను ప్రభుత్వం పెంచేసింది. రీచ్‌లు ఏర్పాటు చేసి.. తమకు అనుకూలమైన కంపెనీలకు కట్టబెట్టింది. ఈ కంపెనీలు ప్రజల ముక్కు పిండి వసూలు చేశాయి. ఇలా వసూలు చేసిన మొత్తంలో పెద్ద తలకాయలకు వాటాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా ఇసుకను నిల్వ చేసుకుని టిప్పర్లలో పక్కరాష్ట్రాలకు అమ్ముకున్నారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాజంపేట నియోజకవర్గాలలో వేల టన్నుల ఇసుకను నిల్వ చేశారు. ఇసుక నిల్వల వైపు అధికారులు ఎవరూ కన్నెత్తి కూడా చూడలేదు. అధికార పార్టీ నాయకుల ధనదాహానికి రాజంపేట నియోజకవర్గంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి రాష్ట్ర ప్రభుత్వ పరువు పోయింది.

అధికార పార్టీ నాయకులకు ఇసుక ప్రధాన ఆదాయ వనరు కావడంతో ప్రజలు ఒక ట్రాక్టర్ ఇసుక కోసం సగటున రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. వీటన్నింటి ఫలితంగా ఐదు సంవత్సరాలుగా జిల్లాలో నిర్మాణ రంగం కుదేలైపోయింది. భవన నిర్మాణ కార్మికులు, కూలీలు పనులు లేక ఇబ్బందులు పడ్డారు. కూలీలు ఇతరత్రా పనులకు వెళ్లలేక.. పనులు దొరక్క.. చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. అయినా అప్పటి ప్రభుత్వం ఇసుకపైన తమ విధానాన్ని మార్చుకోలేదు. ఐదు సంవత్సరాలలో జిల్లాలో అధికార పార్టీ ముఖ్య, స్థానిక నాయకులు వేల కోట్ల రూపాయలు ఇసుక ద్వారా సంపాదించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ డబ్బుతోనే ఈసారి ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉచితంగా ఇసుకను ప్రజలకు ఇవ్వనుండడంతో.. అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణ రంగం పుంజుకుంటుంది..



వైసీపీ ప్రభుత్వంలో విపరీతంగా పెరిగిన ఇసుక ధరల వల్ల దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి ప్రజలు గృహనిర్మాణాలపై ఆసక్తి చూపడం లేదు. భవన నిర్మాణంలో ఇసుక కోసమే ఎక్కువగా ఖర్చు చేయాల్సి రావడంతో ఎక్కువ మంది నిర్మాణాలను వాయిదా వేసుకుంటున్నారు. ఉచితంగా ఇసుక ఇవ్వడం ద్వారా నిర్మాణాలు మళ్లీ ఊపందుకుంటాయి. దీనివల్ల నిర్మాణరంగాన్నే నమ్ముకుని ఉన్న వేలాది మంది కార్మికులకు జీవనోపాధి దొరుకుతుంది.

- బలరాం, బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా

రోజూ ఉపాధి దొరుకుతుంది..



ఉచిత ఇసుక విధానం వల్ల ఇన్నాళ్లు మందకొడిగా సాగిన భవన నిర్మాణ రంగం వేగం పుంజుకుంటుంది. ఉచిత ఇసుక విధానం వల్ల అటు సామాన్య ప్రజలకు, ఇటు భవన నిర్మాణ రంగంలోని మేస్త్రీలు, కూలీలకు రోజూ ఉపాధి దొరుకుతుంది.

- వసంతాల రాజా, మేస్త్రీ, పీలేరు

లక్షన్నర మిగులుతుంది..



వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలు ఉండేది. అప్పట్లో ప్రభుత్వానికి రీచ్‌లో రూ.2400 కట్టేవాళ్లం. ఇప్పుడు ఉచిత ఇసుకతో ఒక ట్రాక్టర్‌కి రూ.3 వేలు మిగులుతుంది. కుంట స్థలంలో ఒక ఇంటి నిర్మాణానికి 50 ట్రాక్టర్లు అనుకున్నా.. మొత్తం మీద ఒకటిన్నర లక్ష ఇంటి నిర్మాణ వ్యయంలో మిగులుతుంది.

- మండిపల్లె మధుసూదన్‌రెడ్డి, మదనపల్లె

ఉచితంగా ఇవ్వడం సంతోషం..



వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దోపిడీని, భవన నిర్మాణ కార్మికుల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. ఇసుకను ఉచితంగా ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో ఇసుకను కొనలేని పరిస్థితుల్లో భవన నిర్మాణ పనులు లేక చాలా ఇబ్బందులు పడ్డాము. కుటుంబాలను పోషించుకోవడం కూడా కష్టమైంది. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇవ్వడం వల్ల.. నిర్మాణ పనులు వేగవంతమై.. మా జీవితాల్లో వెలుగులు వస్తాయని ఆశిస్తున్నాము.

- కాంతారావు, భవన నిర్మాణ కార్మికుడు, రాయచోటి

కొత్త ఇసుక పాలసీతో స్థానిక సంస్థలు బలోపేతం

- ఆర్థికంగా పరిపుష్టి కానున్న పంచాయతీలు

కలికిరి, జూలై 7: జిల్లాలోని స్థానిక సంస్థలకు ప్రభుత్వం నుంచి ఒకటి రెండు రోజుల్లో శుభ వార్త రానుంది. ఐదేళ్లుగా ఆర్థికంగా నీరసించి నిర్వీర్యంగా మారిన గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు, జిల్లా పరిషత్‌లు ఆర్థిక పరిపుష్టి సాధించనున్నాయి. ఐదేళ్లలో మరుగునపడిన సీనరేజీ చార్జీల ద్వారా టీడీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను పునరుజ్జీవింప చేయనుంది. ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ఇసుక పాలసీని పూర్తిగా స్థానిక సంస్థలకు ఆర్థికంగా దోహదం చేసేటట్లు రూపొందించిందని తెలియవచ్చింది. ఉచిత ఇసుక విధానం పేరుతో అమల్లోకి రానున్న దాంతో ప్రధానంగా స్థానిక సంస్థలకు భారీగా ఊరట లభించడమే కాకుండా ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఈ విధానం చేయూత ఇవ్వనుంది.

సీనరేజీ చార్జీలను జమ చేయని వైసీపీ ప్రభుత్వం

ఇసుక, గ్రానైట్, కంకర క్రషింగ్ వంటి వాటికి తప్పనిసరిగా సీనరేజీ చార్జీల పేరుతో ప్రభుత్వం ప్రత్యేకంగా వసూలు చేస్తుంది. ఇలా వసూలయ్యే మొత్తాన్ని ఆర్థిక సంవత్సరం చివరగా జిల్లా పరిషత్తులకు బదిలీ చేయడం పరిపాటి. ఇందులో గ్రామ పంచాయతీల వాటా 50 శాతం, మండల పరిషత్తుల వాటాగా 25 శాతం, మరో 25 శాతం జిల్లా పరిషత్తులకు చెందుతాయి. మైనింగ్ కార్యక్రమాలు జరిగే పంచాయతీలకు మాత్రమే సీనరేజీ వాటా దక్కుతుంది. అదేవిధంగా ఏయే జిల్లాల్లో మైనింగ్ జరుగుతుందో ఆయా మండలాలకు, జడ్పీలకు మాత్రమే ఈ నిధులు వర్తిస్తాయి. ఇవేగాకుండా ఇసుక, కంకర, మట్టి ఉపయోగించి చేసే రహదార్లు, సీసీ రోడ్లు, చెరువుల మరమ్మతులు, ప్రాజెక్టుల నిర్మాణాలు ఇలాంటి అన్ని రకాల పనుల్లో నుంచి కూడా సీనరేజీ చార్జీలు ప్రభుత్వమే కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేస్తుంది. ఇంజినీర్లు బిల్లులు తయారు చేసేటప్పుడే ఈ చార్జీలను తప్పనిసరిగా ఎస్టిమేట్లలోనే పొందుపరుస్తారు. ఇవి ఈ పనులు జరిగే గ్రామ పంచాయతీలు, మండలాలు, జడ్పీలకు దామాషా మేరకు జమవుతాయి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఏ పంచాయతీలోనూ ఇసుక, కంకర ఉపయోగించి పనులు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో ఆయా స్థానిక సంస్థలు కూడా సీనరేజీ చార్జీల విషయమే మర్చిపోయాయి. కాకపోతే ఈ ఐదేళ్లలో ప్రధానంగా ప్రభుత్వమే పెద్ద ఎత్తున ఇసుక వ్యాపారం నిర్వహించిన విషయం తెలిసిందే. అయినా సీనరేజీ చార్జీలను స్థానిక సంస్థలకు చెల్లించే ఆనవాయితీని మాత్రం పాటించలేదు. ఇసుక కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన ఈ సీనరేజీ చార్జీలు అసలు ఎక్కడ జమయ్యాయో కూడా తెలియని పరిస్థితి.

సీనరేజీ పేరుతో వసూలయ్యేదెంత?

ఇసుక, గ్రానైట్ మైనింగ్, కంకర క్రషింగ్ వంటి వాటి నుంచి ఎంత వసూలవుతుందో పరిశీలిస్తే గత ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎంత మేర ఎగ్గొట్టిందన్న విషయం కూడా అర్థమవుతుంది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం తాజా ఇసుక పాలసీలో ఇసుక ధర ఉచితం కాగా, కేవలం సీనరేజీ చార్జీల కోసం రూ.88 మాత్రం చెల్లించాల్సి ఉంటుంది. రూ.275గా నిర్ణయించి టన్నుకు రూ.88లు సీనరేజీ నిర్ణయించి స్థానిక సంస్థలకు జమ చేసేందుకు నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో టన్ను ఇసుక రూ.475 వంతున విక్రయించారు. ఉదాహరణకు కలికిరి మండలంలో బాహుదా నది వెంబడి పారపట్ల, చీకటిపల్లె, పల్లవోలు, గుండ్లూరు, అద్దవారిపల్లె, మహల్ రీచ్‌లను గుర్తించి తవ్వకాలకు అనుమతించారు. గుండ్లూరు రీచ్ నుంచి 35 వేల క్యూబిక్ మీటర్ల (55 వేల టన్నులు) ఇసుకను తవ్వుకునేందుకు ఆదేశాలిచ్చారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన మేరకు టన్నుకు రూ.66 సీనరేజీ చార్జీలు లెక్కిస్తే రూ.36 లక్షలు స్థానిక సంస్థలకు జమ కావాలి. కానీ ఇలా చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం దీనిని కూడా దారి మళ్లించినట్లు చెబుతున్నారు. ఇదే రీచ్‌లో 55 వేల టన్నులకు అనుమతులున్నా అన్ని రకాల 'వాల్టా' చట్టం నిబంధనలను ఉల్లంఘించి ఈ ఒక్క రీచ్ నుంచే 4 లక్షల టన్నుల ఇసుకను అక్రమంగా తోడేశారు. దీనిని కూడా లెక్కిస్తే మొత్తం దాదాపు రూ.2.50 కోట్లు సీనరేజీకి ఎగనామం పెట్టారు. ఒక రీచ్ పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన రీచ్‌లను లెక్కిస్తే అక్రమాలకు అంతే లేకుండా ఉందని చెబుతున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలి
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, జూలై 7: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం సంబేపల్లె మండల పరిషత్ సమావేశ భవనంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంబేపల్లె మండలం గతంలో అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉందని, ఇక నుంచి అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మండలంలో అత్యంత ప్రాధాన్యత పనులు గుర్తించి వెంటనే నివేదిక తయారు చేసి తమకు పంపాలని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి ప్రపోజల్స్ పంపాలన్నారు. జల్‌జీవన్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాల ప్రాధాన్యతను గుర్తిస్తూ ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించి ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు క్షేత్రస్థాయిలో పరిశీలించి జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టాల్సిన నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి పనులు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్థవంతంగా నిర్వహిస్తోందని ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి పేదవాడికి ఇళ్లు నిర్మించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమని హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తయ్యేటట్లు చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. మండలంలో డాక్టర్లు, సిబ్బంది సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా పనులు చేయాలన్నారు. మండలంలో చాలా వరకు భూఆక్రమణలు జరిగాయని, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆక్రమణలకు గురైన భూముల వివరాలను నెల రోజుల లోపల తమకు పంపాలన్నారు. గతంలో రోడ్లు వేయకుండా బిల్లులు చేసుకున్నారని, ఇలాంటివన్నీ అధికారులు గుర్తించాలని తెలిపారు. సంబేపల్లె మండలం గుదియవాండ్లపల్లెలో దాతలు స్థలం ఇచ్చినప్పటికీ అక్కడ అంగన్వాడీ భవనాన్ని నిర్మించేందుకు అధికారులు నిర్లక్ష్యం చేశారని, వెంటనే భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో నియోజకవర్గం వారీగా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని, అధికారులందరూ తమ పరిధిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో నిర్మలాదేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు నుంచి పారిపోయిన ఖైదీ అరెస్ట్


హంతకుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ చైతన్య, సీఐ మద్దయ్య ఆచారి

రాజంపేట టౌన్, జూలై 7: రాజంపేట సబ్‌జైలు నుంచి తప్పించుకున్న ఖైదీని అరెస్టు చేసినట్లు డీఎస్పీ చైతన్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైల్వేకోడూరులో 2018లో రెండు హత్యల్లో నిందితుడిగా ఉన్న షేక్ మస్తాన్ అలియాస్ బాబు జైల్లో వంట పనిచేస్తూ జైలర్‌ను, సిబ్బందిని ఏమార్చి దుప్పట్లను తాడుగా మార్చి ఈనెల 4వ తేదీ గురువారం పారిపోయాడని తెలిపారు. వృత్తిరీత్యా మస్తాన్ ఎలక్ట్రీషియన్ కావడంతో జైలు గోడలు దాటినట్లు డీఎస్పీ తెలిపారు. ఆదివారం చెన్నై-ముంబై ట్రైన్‌లో హంతకుడు వెళుతున్నట్లు సమాచారం అందడంతో పట్టణ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో ఎస్ఐలు మోహన్‌గౌడ్, వెంకటేశ్వర్లు తమ సిబ్బంది హంతకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు కృషి

- అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి పాటుపడుతా
- కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ చామకూరి

రాయచోటి (కలెక్టరేట్), జూలై 7: రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా నూతన కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. ఆదివారం ఉదయం 11.32 గంటలకు కలెక్టర్ చాంబర్‌లో వేద పండితుల ఆశీర్వచనాలతో జిల్లా 3వ నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనది 2016 ఐఏఎస్ బ్యాచ్ అని, బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న తనను రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా నియమించిందని తెలిపారు. ఇది తనకు మొట్టమొదటి కలెక్టర్ పోస్టు అని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్డీవోలు, అన్ని శాఖల జిల్లా అధికారులు పుష్పగుచ్ఛంతో కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.


కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్ చామకూరి

సౌమ్యనాథుడి సన్నిధిలో ఎస్పీ కృష్ణారావు

నందలూరు, జూలై 7: నందలూరు సౌమ్యనాథస్వామిని ఎస్పీ కృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఎస్పీ వెంట రాజంపేట డీఎస్పీ చైతన్య, మన్నూరు సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.


తీర్థ ప్రసాదాలు అందుకుంటున్న ఎస్పీ కృష్ణారావు

ప్రైవేటు స్థలంలో ప్రభుత్వ బోరు.. పంచాయతీకి బిల్లు!

● చిలమకూరులో నిబంధనలకు తిలోదకాలు ● రూ.27,42,250 బకాయిలు తేల్చిన డీఎల్‌పీఓ ● ఎంపీటీసీ ఫిర్యాదుతో వెలుగుచూస్తున్న నిజాలు ● నీటి వ్యాపారంపై నిలదీస్తున్న కూటమి నేతలు

ఎర్రగుంట్ల, జూలై 7: మండలంలోని మేజర్ పంచాయతీ చిలమకూరులో మరో విద్యుత్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. చిలమకూరులో పంచాయతీలో అవినీతి, అక్రమాలపై బీజేపీ ఎంపీటీసీ నవీన్ కుమార్ 2021లో కలెక్టర్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో డీపీఓ ఆదేశాల మేరకు కడప డీఎల్‌పీఓ మస్తాన్‌వలి విచారణ చేస్తున్నారు. పంచాయతీలో ఎన్‌ఎంఆర్‌గా పనిచేస్తున్న ఆవుల రామకృష్ణ స్థలంలో ప్రభుత్వ అధికారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. అధికారులు బోరు వేయగా పంచాయతీ పేరుతో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేశారు. ఈ విషయంపై ఎంపీటీసీ నవీన్‌కుమార్‌తో, కూటమి నేతలు బి.బాలవెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డితో డీఎల్‌పీఓ బుధవారం బోరును పరిశీలించారు. అది ప్రైవేటు స్థలంగా నిర్ధారించారు.





బోరువేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ - బకాయిపడిన విద్యుత్ బిల్లులు

విధిలేకే : డీఎల్‌పీఓ మస్తాన్‌వలి

ప్రైవేట్ స్థలాల్లో ప్రభుత్వ బోరు వేయకూడదు. అందులోనూ పంచాయతీలో ఎన్‌ఎంఆర్‌గా పనిచేస్తున్న వ్యక్తి అయితే నీటి ఎద్దడి ఉన్న దృష్ట్యా విధిలేని పరిస్థితిలో అక్కడ బోరు వేశారు. ఆ వ్యక్తి స్థలాన్ని పంచాయతీకి రాయించుకోలేదు. ప్రభుత్వ విద్యుత్ మీటర్ బిగించారు. దానికి ప్రస్తుతం రూ.27,42,250 బకాయిలున్నట్లు తెలిసింది. ఇదే బోరు నుంచి ట్యాంకర్లతో గ్రామం లోని ప్రజలకు నీటిని సరఫరా చేసి బిల్లులు చేసుకున్నట్లు తెలిసింది. అందుకు సంబంధించి చెక్కులను కూడా ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం. అయితే ఇదే మోటార్ నుంచి కొన్ని వీధులకు డైరెక్టు పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేసినట్లు చెబుతున్నారు. వాటిపై కూడా పూర్తిస్థాయిలో విచారిస్తాం. ఉన్నది ఉన్నట్లుగా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఎంపీటీసీ అడిగిన పనులన్నింటి వివరాలు ఇచ్చాం. వారికి ఎక్కడ అనుమానం ఉన్నా వాటిని పరిశీలించి నిజానిజాలు తేలుస్తాం.

వ్యాపారం చేశారు: ఎంపీటీసీ నవీన్‌కుమార్

ఎన్‌ఎంఆర్‌గా పనిచేస్తున్న ఆవుల రామకృష్ణ నిబంధనలకు విరుద్ధంగా సొంత స్థలంలో ప్రభుత్వ బోరు వేయించుకున్నారు. ఆ బోరుకు మోటార్ అమర్చి ప్రభుత్వ మీటర్ ద్వారా చిలమకూరు సహా ఇతర చోట్లకు కూడా ట్యాంకర్లతో వ్యాపారం చేశాడు. ఆయన భార్య పేరుతో పనులు చేసి పంచాయతీ చెక్కుల ద్వారా బ్యాంకుల్లో నిధులు జమచేసుకున్నారు. వీటిపై అధికారులు నిజానిజాలు తేల్చాలి. ఆ బోరుకు రూ.27,42,250 బకాయిలున్నట్లు విద్యుత్ అధికారులు బిల్లులు చూపించారు. ఆదాయం తక్కువగా ఉన్న ఇంత చిన్న పంచాయతీకి అంత భారీ మొత్తంలో విద్యుత్ బిలులు వచ్చాయంటే ఎంతటి అక్రమాలు జరిగాయే తెలుస్తోంది. గ్రామంలో చేసిన అన్ని పనులపై తాము విచారణ చేస్తున్నాము. పనులు చేయకుండా నిధులు దుర్వినియోగం చేసిన విషయాన్ని త్వరలో అధికారులను తీసుకెళ్లి చూపిస్తాం.

చర్యలు తీసుకోవాలి : కూటమి నేతలు

చిలమకూరులో జరిగిన అవినీతి అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు బాలవెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి అధికారుల ను కోరారు. వారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన స్థలంలో బోరు వేసుకుని 0032260 నెంబరుతో ప్రభుత్వ మీటరును ఏర్పాటు చేసుకుని పంచాయతీలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో కూడా నీటి వ్యాపారం చేశారని ఆరోపించారు. వీటిన్నీ విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐసీఎల్ నిధులు గోల్‌మాల్

చిలమకూరు ఐసీఎల్ వారు పంచాయతీకి సీఎస్ఆర్ ద్వారా ఇచ్చిన నిధులు కూడా దుర్వినియోగమైనట్లుఆరోపణలు చేశారు. అధికా రులు ఐసీఎల్ వారిని నివేదిక కోరగా వారికి సరైన సమాధానం ఇవ్వలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతర గ్రామాలకు ఇచ్చిన వాటిని, గ్రామంలో మెడికల్ క్యాంపుల గురించి మాత్రమే ఇచ్చినట్లు ఎంపీటీసీ ఆరోపించారు. వీటన్నింటిపై మళ్లీ విచారించాలని అధికారులను డిమాండ్ చేశారు. చిలమకూరులో తవ్వేకొద్దీ అక్రమాలు బయట పడుతున్నట్లు అధికారులు సైతం వివరిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ బకాయిలు రూ.4.40లక్షల విషయం మరవక ముందే మరో విద్యుత్ బకాయి బయటపడడం ఆశ్చర్యానికి గురిస్తోందని వారు ఆరోపించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

● పలువురికి తీవ్రగాయాలు



డ్రైవర్ సాహిల్ మృతదేహం

దువ్వూరు (మైదుకూరు), జూలై 7 : వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమా దాల్లో ముగ్గురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాదు నుంచి తిరుపతికి వెళ్తున్న కంటైనర్ లారీని దువ్వూరు బైపాస్ రోడ్డులో వెనుకనుంచి మినీలారీ ఢీకొనడంతో మినీ లారీ డ్రైవర్ సాహిల్ (42)తో పాటు కుందన్, విశాల్ గాయపడ్డారు. వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిం చగా హైదరాబాదుకు చెందిన సాహిల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దువ్వూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని..



మృతిచెందిన వీరయ్య

చాపాడు, జూలై 7: మండలంలోని పల్లవోలు, నాగులపల్లె బస్టాపుల మధ్య జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండు వీరయ్య (60) అనే వృద్ధుడు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరయ్య తన సొంత గ్రామం అయిన నాగులపల్లె నుంచి టీవీఎస్ వాహనంపై చాపాడు గ్రామానికి వస్తుండగా ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

కారు ఢీకొని స్కూటరిస్టు..



మృతి చెందిన చెన్నయ్య

మైదుకూరు, జూలై 7 : కారు ఢీ కొనడంతో బైక్ పై వెళతున్న ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు... కాశీనాయన మండలం అంబవరానికి చెందిన సోమిరెడ్డిపల్లె చెన్నయ్య (73) తన కూతురిని చూసేందుకు ద్విచక్ర వాహనంలో కడపకు వెళుతుండగా మండలంలోని వనిపెంట వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ.. ముగ్గురికి గాయాలు

మైదుకూరు, జూలై 7 : ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. ఆళ్ళగడ్డ నుంచి మైదుకూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును, ప్రొద్దుటూరు నుంచి నెల్లూరు వెళ్తున్న లారీ ఆదివారం సాయంత్రం పట్టణంలోని రాయల్ సర్కిల్ వద్ద ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలు తగిలాయి. కాగా మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు



పట్టుబడిన ట్రాక్టరు

పోరుమామిళ్ల, జూలై 7 : రెవెన్యూ అధికారుల అనుమతి లేకండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శిరీషా హెచ్చరించారు. ఆదివారం కొందరు ట్రాక్టర్లతో అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయం తహసీల్దారు దృష్టికి వెళ్లడంతో ఆమె ఆదేశాల మేరకు ఆర్ఐ సుధాకర్ రెడ్డి, సిబ్బందితో వెళ్లి నాగేంద్ర అనేవ్యక్తికి చెందిన ట్రాక్టరును సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయంలో ఉంచారు. అనుమతి లేకుండా గ్రావెల్ తరలించడానికి ప్రయత్నిస్తే ఎంతటి వారిపైనా ఉపేక్షించే ప్రసక్తిలేదని ఆమె తెలిపారు.

కొండూరుకు చేరిన పెంచలయ్య మృతదేహం



పెంచలయ్య మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు

అట్లూరు, జూలై 7 : అట్లూరు మండలం కొండూరు గ్రామానికి చెందిన పెంచల య్య గురువారం తెల్లవారు జామున కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. అ క్కడే ఉన్న ఆయన ఇద్దరు కుమారులు, బంధువుల సహాయంతో పెంచలయ్య మృతదేహన్ని శనివారం రాత్రికి వారి సొంత ఊరు కొండూరుకు తీసుకువచ్చారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

హైకోర్టు జూనియర్ స్టాండింగ్ కోచ్‌గా పోరుమామిళ్లవాసి



రావుల నాగార్జున

పోరుమామిళ్ల, జూలై 7 : హైకోర్టు జూనియర్ స్టాండింగ్ కోచ్‌గా పోరుమామిళ్ల వాసి రావుల నాగార్జున నియమితులయ్యారు. పోరుమామిళ్ల చెందిన రావుల వెంకట సుబ్బమ్మ మనవడు రావుల పెద్ద నాగేశ్వర్‌రావు - పద్మా వతి కుమారుడు హైకోర్టు ది సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్ డైరెక్టు యాక్సెస్ ఇన్ ద కస్టమ్స్ (సీబీఐసీ) డిపార్ట్ మెంటు తరపున వాదనలు వినిపించేందుకు నియమితు లయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవనం నుంచి ఈ నెల 4న ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోరుమామిళ్లలో ప్రైవే టు స్కూలులో ఇంగ్లిషు మీడియంలో విద్యాభ్యాసం చేసి న అనంతరం గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కళా శాలలో న్యాయశాస్త్రం పూర్తి చేశారు. 2021-22 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్‌కు ఎగ్జిక్యూటివ్ మెంబరుగా ఎన్నికయ్యారు. ఆయన నియామకంపై పోరుమామిళ్లవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన



పులివెందుల శిల్పారామంలో ప్రదర్శన ఇస్తున్న ఇంద్రజాలికుడు హరేరామ్ జాదూగర్

పులివెందుల రూరల్, జూలై 7: పులివెందుల శిల్పారామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇంద్రజాల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. నంది అవార్డు గ్రహీత, జాదూ కళారత్న, ఇంద్రజాల తేజంఅవార్డు గ్రహీత, రాయలసీమ ప్రముఖ ఇంద్రజాల ప్రదర్శకుడు హరేరామ్ జాదూగర్ ఈ ప్రదర్శన ఇచ్చినట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా పావురాలు తీయడం, కోడిగుడ్లు నోట్లో వేసుకొని చేతులలో నుంచి తీయడం, ప్లెయిన్ పేపర్‌ని డబ్బులుగా మార్చడం, రింగులు నుంచి రింగులు తీయడం తదితర ప్రదర్శనలు ఇచ్చారు. ఈ ప్రదర్శన సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమాన్ని విజయంతం చేసిన సందర్శకులకు ఏఓ సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం కోసం మహిళ పోరాటం

● కూతుళ్లతో కలసి భర్త ఇంటి ముందు ఆందోళన

బద్వేలుటౌన్, జూలై 7 : అగ్నిసాక్షిగా తాళికట్టి 7 అడుగులు నడిచి ఈ జన్మంతా నీకు తోడుగా ఉంటానంటూ ప్రమాణం చేసి.. ఇద్దరు కూతుళ్ల పుట్టిన తరువాత ఇంటినుంచి గెంటేశాడంటూ ఓ మహిళ న్యాయ పోరాటం ప్రారంభించింది. తనకు న్యాయం చేయాలం టూ కూతుళ్లతో కలసి ఆదివారం భర్త ఇంటి ముందు దీక్ష ప్రారంభించింది. వివరాల్లోకి వెళితే బద్వేలు పట్టణంలోని కోటవీధికి చెందిన కళ్యాణ్, అబ్బరాతివీధికి చెందిన లక్ష్మీప్రసన్నకు 17 ఏళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం వారికి ఇద్దరు కూతుళ్లున్నారు. అయితే ఇంట్లో చిన్న చిన్న గొడవలు జరగడంతో ఇరువరి మధ్య సఖ్యతలేక దూరమయ్యారు. ఐదేళ్ల క్రితం భర్త వదిలేయడంతో లక్ష్మీప్రసన్న కడపలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు పాఠశాలలో పని చేసుకుంటోంది. తమకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేయడంతో కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం తనకు న్యాయం చేయాలంటూ భర్త ఇంటి ముందు ధర్నా ప్రారంభించింది.

అన్నదమ్ముల ఘర్షణ



సర్దిచెబుతున్న పోలీసులు

ఖాజీపేట, జూలై 7: ఆస్తి పంపకాల విషయంలో మండల పరిధిలోని నరస్ఖాన్‌పేటకు చెందిన బషీర్, జాఫర్ ఆదివారం ఘర్షణ పడ్డారు. తరచూ వారు ఘర్షణ పడుతుండడంతో, గ్రామస్థులు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు రంగప్రవేశం చేసి ఘర్షణను నివారించారు. పోలీసులు సరైన సమయానికి స్పందించడంపై గ్రామస్థులు అభినందించారు.

అవినీతిలో భాగస్వాములైతే.. చర్యలు తప్పవు

● జగనన్న లేఅవుట్లలో ఇసుక స్కాంపై విచారణ

● హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య

ప్రొద్దుటూరు , జూలై 7 : ప్రొద్దుటూరు రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం జగనన్న కాలనీలలో ఇళ్ళ నిర్మాణాలకు ఇసుక రవాణాలో రెండు కోట్ల మేర స్కాం జరిగినట్లు ఆంధ్రజ్యోతిలో శుక్రవారం వచ్చిన కథనంపై కలెక్టర్ స్పందించారు. ఈ కథనంపై ఆరా తీసి నివేదిక సమర్పించాలని హౌసింగ్ పీడీ కృష్ణయ్యను ఆదేశించారు. దీంతో కడప హౌసింగ్ ఈఈ హుస్సేనప్పను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి జూలై 10 లోపుగా విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు పీడీ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆదివారం ఆయన ఫోన్ ద్వారా వివరాలు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎంతటి వారున్నా చర్యలు తప్పవని హె చ్చరించారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఇసుక కూపన్ల స్కానింగ్ పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. కానీ డీఈ ఇస్తున్న నివేదికలకు ఏఈలు ఇస్తున్న రిపోర్టులకు తేడాలున్నాయన్నారు. జగనన్న లేఅవుట్‌లకు జేపీ వెంచర్స్‌వారు ఇసుక రవాణా చేయకనే ఇన్ వాయిస్‌లు ఆన్‌లైన్‌లో ఎవరు అప్‌లోడ్ చేశారు. తేదీల వారీగా రికార్డుల ను పరిశీలించాల్సి ఉంటుందన్నారు. రవాణా చేసిన ఇసుక, ఇళ్ళ నిర్మా ణంలో వాడిన ఇసుక పరిమాణానికి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఇచ్చే కూపన్లకు తేడాలెందుకు వస్తున్నాయన్న అంశం పరిశీలించాల్సి ఉందన్నారు కాగా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఒక కూపన్‌కు 5 టన్నుల ఇసుక వాడుకున్నట్లు రికార్డుల్లో నమోదు చేయాలి. ఆ మేరకు ఇళ్ల నిర్మా ణం ఎంత జరిగింది. ఎన్ని ఇళ్లు నిర్మించారు. అసలు నిర్మాణం జరగకున్నా, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎందుకు ఇసుక కూపన్‌లు ఇచ్చారు.. ఎందుకు హౌసింగ్ ఏఈలు వారిపై ఒత్తిడి పెంచుతున్నారన్నది తేలాల్సి ఉంది. కానీ నెపం ఒకరిపై వేసి, అసలు నిందితులు తప్పించుకోవాలని చేయని ప్రయత్నం లేదు. ఈఈ రాజారత్నంకు ఇచ్చిన నివేదిక ప్రకారం దాదాపు 37 వేల మెట్రిక్ టన్నుల మేరకు తేడాలను గుర్తించారు. ఆ తేడాలు ఇన్ని నెలలు గడుస్తున్నా ఇంతకాలం ఎందుకు కప్పిపుచ్చుతున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడు తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తప్పని పరిస్థితుల్లో విచారణ అధికారిని నియమిస్తూ హౌసింగ్ పీడీ ఉత్తర్వులు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. అయితే అదే శాఖకు చెందిన కడప ఈఈని విచారణా ,ధికారిగా నియమించడంతో ఇక్కడి అధికారులు ఆయనను ప్రభావితం చేయరన్న గ్యారెంటీ లేదు. రెవెన్యూ అధికారులనో, ఇతర శాఖ అధికారుల నో విచారణ అధికారిగా నియమించి పూర్తిస్థాయిలో అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం వుంది. ప్రొద్దుటూరులో డీఈ ఇస్తున్న నివేదికలు అనేక అనుమానాలకు దారి తీస్తున్నాయి. ఈఈ రాజారత్నం ముగ్గురు ఏఈలకు మాత్రమే షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇంకా వర్క్ ఇన్‌స్పెక్టర్ల పాత్రపై కూడా విచారణ జరగాల్సి ఉంది.. అయితే రిపోర్టుల్లో తేడాలున్నా ఏఈలకు అనుకూలంగా డీఈ ఎందుకు రిపోర్టులు ఇస్తున్నాడన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. ఇందులో డివిజన్ అధికారులు, సిబ్బంది పాత్రపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికైనా అన్ని కోణాల్లో విచారణ జరిగేలా చర్యలు తీసుకోకుంటే విచారణ తూతూ మంత్రంగా మారే అవకాశాలున్నాయి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇసుక స్కాంపై ముఖ్యమంత్రి ఫిర్యాదు

ఇసుక స్కాంపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో వున్న అధికారులతో ఈ స్కాం బయటికి రాదని, వారిని మార్చి వేరే అధికారులతో నిష్పక్షపాతంగా విచారణ చేయించాలని ఆయన కోరనున్నారు. జగనన్న లేఅవుట్‌లో కాంట్రాక్టర్ల పేర కొందరు వైసీపీ నేతలు ఇళ్ళ నిర్మాణాలు చేస్తామని లబ్ధిదారుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో వీటన్నింటిపై విచారణ జరిపించాలని కోరనున్నారు. టిడ్కో ఇళ్లు కూలగొట్టి, ఎంఐజీ లేఅవుట్ డెవలప్‌మెంట్ పేర అనుడా అధికారులు చేసిన పనులు, ఆగమేఘాలపై మంజూరు చేయించుకున్న బిల్లులపై అనుడా అధికారులపై విచారణ చేయాలని ఆయన కోరనున్నారు.

'ప్రజా అవసరాలకు ఇసుకను అందుబాటులో ఉంచాలి'



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

సిద్దవటం, జూలై 7: ప్రజా అవసరాలకు ఇసుకను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తహసీల్దారు మురషావలి, మండల అధికారులకు సూచించారు. సిద్దవటం మండలంలోని జ్యోతి గ్రామంలోని పెన్నానదిలో ఇసుక రీచ్‌ను ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్ద రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రీచ్ వద్ద 24 గంటలు సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. జ్యోతి అంగన్‌వాడీ కేంద్రం వద్ద నీరు నిలుస్తున్నాయని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా 10 రోజుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, తహసీల్దారు, ఎంపీడీవోలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తమరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబన్న, ఏపీఎం వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనురాధా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టా చొరవతో సాగునీటి సమస్య పరిష్కారం



కాలువ వద్ద గుమికూడిన సుంకేసుల గ్రామస్థులు

ఖాజీపేట, జూలై 7: వ్యవసాయంపై నేతల చిన్నచూపు కారణంగా సాగు నీటి వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో పాటు, కాలువలు ఆక్రమణకు గురికాగా, ప్రస్తుత శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవ తీసుకుని కాలువల మరమ్మతు పనులు వేగవంతం చేశారని సుంకేసుల గ్రామస్థులు అన్నారు. ఆదివారం సబ్‌స్టేషన్ సమీపంలోని కాలువ వద్ద సుంకేసుల గ్రామస్థులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్కిలేరు కాలువ కింద సుంకేసుల, బీచువారిపల్లె గ్రామాల్లో దాదాపు 700 ఎకరాలకు నీరు అందుతుందని, వైసీపీ ప్రభుత్వహయాంలో ఈ కాలువలు ఆక్రమణకు గురయ్యాయని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సుంకేసుల గ్రామానికి వచ్చినప్పుడు వక్కిలేరు నుంచి పొలాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరడంతో గెలిచిన వెంటనే పనులు పూర్తి చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించండి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఖాజీపేట, జూలై 7: పరిసరాల పరిశుభ్రతపై గ్రామీణుల్లో అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వి.మల్లేష్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తనెల్లూరు ఎస్సీ కాలనీని పరిశీలించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఆ గ్రామంలో డాక్టర్ ముబిన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ఉధృతి ఎక్కువగా ఉండడంతోపాటు, తాగునీరు కలుషితమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు రాత్రివేళల్లో దోమతెరలు వాడాలని తెలిపారు. . గ్రామంలో అతిసార లేదని, కొద్దిమందికి జ్వరాలు వస్తున్నాయని, వైద్యసిబ్బంది గ్రామంలో పర్యటించి ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్నారు. పరిసరాల్లో నీరు నిలువ ఉన్నా, వ్యక్తిగత శుభ్రత పాటించకపోయినా రోగాల బారిన పడక తప్పదన్నారు. వైద్యుల సలహాలు పాటించగలిగితే జ్వరాలను అదుపులోకి తీసుకురావచ్చన్నారు. జిల్లా ఎపిడియాలజిస్టు ఖాజామోదీన్ మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధులపై గ్రామంలో అవగాహన కల్పిస్తామన్నారు. వేడిగా ఉండగానే భోజనం చేయడంతో పాటు, నీటిని కాచి చల్లార్చి వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రామసుబ్బారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, కొత్తపేట సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

రాయచోటిటౌన్, జూలై 7: పట్టణంలోని నాజ్ హాల్ సమీపంలో అబ్దుల్ రహీం (22) అనే యువకుడు ఆదివారం దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. గున్నిగుంట్ల రోడ్డు సమీపంలోని గుర్రాలకుంటలో మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా ఇంటికి తీసుకెళ్లారు. అయితే, తన కుమారుడిని ఎవరో హత్య చేశారని అబ్దుల్ రహీం తండ్రి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

రోజూ మద్యం తాగి వేధిస్తున్నాడన్న కారణంతో కుటుంబ సభ్యులే గొంతుకోసి హత్య చేసి ఉంటారని మృతుడి తండ్రితో పాటు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు.

ప్రజలు కష్టాలపాలు.. నిధులు నీళ్లపాలు...

- నచ్చినోళ్లకు నిధులు కుమ్మరింత
- కలగా మిగిలిన అభివృద్ధి..!
- సమాచారం ఇచ్చేందుకు మొగ్గుచూపని ఓ అధికారి



సుండుపల్లె, జూలై 7: గత ఎన్నికల్లో 151 సీట్లతో వైసీపీ ఘనవిజయం సాధించడంతో ప్రజలకు మేలు జరుగుతుందని, సమస్యలు పరిష్కారమవుతాయని అందరూ ఆశపడ్డారు. అప్పట్లో రాజంపేటలోని వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు. ఆ విజయానికి సుండుపల్లె మండల ఓటర్లు ఎంతో దోహదపడ్డారు. అంతా మంచి జరుగుతుందని ఆశపడ్డ ప్రజలకు ఐదేళ్ల పాటు నిరాశే ఎదురైంది. గత ఐదేళ్లుగా ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల నిధులు విడుదలైనా అవి ఎక్కడికి వెళ్లాయో.. ఏమయ్యాయో.. ఎవ్వరికీ తెలియని రాజకోట రహస్యంలా మారింది. శృతి మించిన అరాచకాలు, అక్రమాలతో పాటు ప్రభుత్వ నిధులు మింగేశారు. నిధుల గుట్టు బయటికి రాకపోవడంతో సుమారు 261 పల్లెల్లో ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడ్డారు. ఇదంతా ఆయా శాఖలో పనిచేసే అధికారులు చలువేనని స్పష్టంగా తెలుస్తోంది. అధికారుల అక్రమ సంపాదనకు ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం అవకాశం వైపు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఎదరయ్యాయి.

సుండుపల్లె మండల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిగా గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఓ అధికారి చొరవతోనే నిధులు దుర్వినియోగం అయ్యాయని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఇష్టారాజ్యంగా వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు, కొంత మంది ప్రజాప్రతినిధులకు పనులు చేయకపోయినా బిల్లులు తయారు చేసి ఇచ్చి నిధులు దుర్వినియోగం అవడంలో కీలక పాత్ర పోషించారని ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నాయకులకు బిల్లులు పెట్టాలంటే పెద్ద సంఖ్యలో ముడుపులు తీసుకుని జేబులు నింపుకున్నట్లు వైసీపీ నాయకులే విమర్శలు చేస్తున్నారు.

చెయ్యనిదే చేసినట్టు బిల్లులు

మండలంలోని దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు చేయకపోయినా చేసినట్టు నిధులు బొక్కేసినట్లు విమర్శలున్నాయి. కొత్త పంపుసెట్లు, పైపులు అమర్చకపోయినా అమర్చినట్లు నిలువు దోపిడీ చేశారు. నాసిరకం పైపులైన్ల ఏర్పాటు చేసి అసలు పనులే చేయకుండా బోర్లే వెయ్యకుండా బిల్లులు పెట్టి అధికార పార్టీలో ఉన్న నాయకుల జేబులు నింపేశారని విమర్శలున్నాయి. ఈ నిధుల దుర్వినియోగంలో మండల అధికారుల నుంచి పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఉందని తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధుల్లో 70 శాతం నిధులు పక్కదారి పట్టాయని స్పష్టంగా తెలుస్తోంది. సుమారు పదేళ్ల నుంచి సుండుపల్లెలో ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలో పనిచేస్తున్న ఓ అధికారిని నిధుల వినియోగంపై వివరణ కోరగా ఇచ్చేందుకు సుముఖత చూపడం లేదు. గత ప్రభుత్వంలో కూడా నిధుల వినియోగంపై సమాచారం ఇవ్వాలని ఏకంగా వైసీపీ నాయకులే సమాచార హక్కు పత్రంలో విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. ఓ మండల స్థాయి అధికారి వివరణ ఇవ్వలేదంటే మండలంలో ఏ స్థాయిలో నిధుల దుర్వినియోగం జరిగిందో అర్థం చేసుకోవచ్చని పలువురు ఆరోపిస్తున్నారు.

విపత్తును ఆదాయ వనరుగా మార్చేశారు

నివర్ తుఫాన్ సమయంలో మండల వ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత మంది నిలువ నీడను కోల్పోయారు. 2020 సంవత్సరం చివరిలో వచ్చిన నివర్ తుఫాన్ వలన ప్రాజెక్టులు, కుంటలు తెగిపోవడం, ఇండ్లలోకి వర్షపు నీరు ఇచ్చి ప్రజలకు ఆస్తి నష్టం జరిగింది. అలాగే రహదారులు, వంతెనలు, చిన్న చిన్న మట్టి కట్టలు తెగిపోవడం, వీధుల్లోని రహదారుల్లో గుంతలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో అధికార పార్టీ నాయకులు, అధికారులు ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేశారంటూ విమర్శలున్నాయి. ఆ నిధులను ఆరోకరగా మట్టి తోలిన వారిని, తోలకపోయినా అధికార పార్టీలో క్రియాశీలకంగా ఉన్న వారి పేర్లతో నిధులు మళ్లించారు. అప్పట్లో ప్రజలకు తాగునీటిని సరఫరా చేసినట్లు కూడా పెద్ద మొత్తంలో బిల్లులు పెట్టుకున్నట్లు సమాచారం. ఈ నిధుల దుర్వినియోగంపై అధికారంలో ఉన్నన్ని రోజులు ఎవ్వరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో జరిగిన అవినీతి బయట పెట్టేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరి గుట్టు ఎప్పుడు బయట పడుతుందోనని అధికారులు అయోమయంలో ఉన్నట్లు తెలుస్తోంది.

విచారించి చర్యలు తీసుకుంటాం

- నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ

నిధులు దుర్వినియోగం జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల అవసరాలు తీర్చేందుకు అధికారులు ఉన్నాము. అలా కాదని ప్రజల కష్టాలు గాలికి వదిలి నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు.





మాచిరెడ్డిగారిపల్లెలో బోరు వేసి గ్రామాలకు పైపులైను కనెక్షన్ ఇవ్వక వదిలేసిన దృశ్యం, ఉపయోగంలో లేని వాటర్ ట్యాంక్, వేసవిలో వ్యవసాయ బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న మహిళలు (ఫైల్)

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- 20 సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు



సుండుపల్లె, జూలై 7: ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయని పూర్వ విద్యార్థి, కేంద్ర సమాచార ప్రజా మంత్రిత్వశాఖ ట్రైబల్ బ్యూరో కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీసర్ ధర్మానాయక్ తెలిపారు. 20 సంవత్సరాల కిందట 2004-05 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వాళ్లందరూ వచ్చి ఒకరికొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు నాగరాజు, జయప్రకాశ్, వసంత, రాంమోహన్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటికే ప్రాధాన్యత

గాలివీడు, జూలై 7: రాయచోటి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగు, సాగునీటికే అధిక ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పూలుకుంట గ్రామం చౌడేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో టీడీపీ నాయకుడు ఆవులకుంట నాగార్జున కుమారుని కేశఖండన కార్యక్రమంలో పాల్గొని చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్‌రఫీ, శ్రీనివాసరాజు, మాజీ ఎంపీపీ మోపూరి వెంకట్రమణ, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కసిరెడ్డి వెంకటశివారెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌బాబును కలిసిన టీడీపీ నాయకులు



ప్రసాద్‌బాబును శాలువా, గజమాలతో సత్కరిస్తున్న ఒంటిమిట్ట టీడీపీ నేతలు

రాయచోటిటౌన్, జూలై 7: ఒంటిమిట్ట మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ కార్యానిర్వాహక కార్యదర్శి, టీడీపీ పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసి గజమాల వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఒంటిమిట్ట మండలంలో టీడీపీ పరిస్థితులపైన, మండల సమస్యలపైన చర్చించారు. అనంతరం పట్టణంలోని కొత్తపేట రామాపురానికి చెందిన టీడీపీ యువనాయకులు జగదీశ్, తేజస్, అనిల్, నవీన్, నగేశ్, హేమంత్, అర్జున్ తదితరులు ప్రసాద్‌బాబును మర్యాద పూర్వకంగా శాలువా కప్పి పూలబొకేతో సత్కరించారు.

పశుగ్రాస వారోత్సవాలను జయప్రదం చేయండి

రాజంపేట, జూలై 7: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో నేటినుంచి వారం రోజుల పాటు జరిగే పశుగ్రాస వారోత్సవాలను జయప్రదం చేయాలని పశువైద్యుడు డాక్టర్ వై.విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం రాజంపేట మండలం మందరం, కొత్తపల్లె గ్రామాల్లో జరిగిన పశుగ్రాస వారోత్సవాల్లో పాడిరైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన పశుగ్రాసాన్ని అందజేస్తామన్నారు. పశుగ్రాసం ప్రాముఖ్యత, పోషక విలువల గురించి తెలియజేశామని తెలిపారు. మునగ, కరివేప, అవిసె వంటి మొక్కలలో పోషకాలు విరివిగా లభిస్తాయన్నారు. దీనిద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు ప్రతాప్, భాగ్యవతి, వరదయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూమి దక్కేవరకు పోరాటం



బంజరు భూములను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, జూలై 7: ఎర్రజెండా చేపట్టి నిరుపేదలందరికి భూములు దక్కేవరకు పోరాటాలు చేస్తామని రైల్వేకోడూరు సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్‌లు తెలిపారు. ఆదివారం మండలంలోని కే.బుడుగుంటపల్లె పంచాయతీ పరిధిలో బంజరు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కే.బుడుగుంటపల్లె పంచాయతీ సర్వే నెంబరు 2179లో దాదాపు 60 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ప్రభుత్వ బంజరు భూములను ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ బంజరు భూములను పేదలకు ఇవ్వకపోతే సోమవారం రాజంపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో షేక్ హజ్మాబీ, షహిన్ష, శివ, వినయ్, సోని, తేజ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.55 వేల విరాళం

చిట్వేలి, జూలై 7: మండల పరిధిలోని స్తంబారాయుడు ఆలయం సమీపాన నూతనంగా నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి గుడ్లవారిపల్లెకు చెందిన కీ.శే. బత్తిన చిన్నగుండాలరెడ్డి, బత్తిన ఈశ్వరమ్మ శివలింగం, పీఠంకు రూ.55 వేలు వితరణగా అందించినట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని ఆయన కోరారు.

దొడ్డిదారిన ఎంపికైన ప్రజాప్రతినిధులు ఎక్కడ ?

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, జూలై 7: వైసీపీ నాయకులు అధికారం అడ్డుపెట్టుకొని స్థానిక సంస్థ ఎన్నికల్లో దొడ్డిదారిన గెలిచిన ప్రజాప్రతినిధులు ఎక్కడికెళ్లారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచులు గైర్హాజరు కావడంతో వీరికి ప్రజా సమస్యలు పట్టవా అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడితే తెలిసేదని, కాగితాలు అడ్డుపెట్టుకొని గెలిచిన వారికి ఏం తెలుస్తుందన్నారు. కోరం లేక సమావేశం వాయిదా పడింది. గత ప్రభుత్వంలో సంబేపల్లె మండలంలో కరువుతో రైతులు విలవిల్లాడితే కనీసం కరువు మండలంగా కూడా ప్రకటించలేదన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో తన గెలుపునకు సహకరించిన మండల ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. అధికారులపై పెత్తనం చేయడం, ప్రజలపై అక్రమ కేసులు పెట్టడం వంటి సంస్కృతికి తాము దూరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, రవీంద్రారెడ్డి, యువగళం సిద్దారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, భయ్యారెడ్డి, శివప్రసాద్, రెడ్డిమట్టి శ్రీనివాసులు నాయుడు, మట్టి వేణు రాజారెడ్డి, సుబ్బరాజుయాదవ్, భాస్కర్‌రెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, వెంకట్రమణ, పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: మండలంలోని కాటిమాటకుంట గ్రామం బొట్ల చెరువులో అనారోగ్యంతో మృతి చెందిన రిటైర్డ్ హెడ్మాస్టర్ బొజ్జా సంజీవరెడ్డి మృతదేహాన్ని ఆదివారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సందర్శించి భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నందలూరు: సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని రాయచోటిలోని మంత్రి కార్యాలయంలో ఆదివారం కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి దిలీప్, మాజీ మండలాధ్యక్షుడు లక్ష్మీనరసయ్య, చింతకాయపల్లె ఎంపీటీసీ పెంచలయ్య, యల్లంరాజుపల్లె సుబ్బారెడ్డి, రాముయాదవ్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకులపై దాడి అప్రజాస్వామికం

- సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటిటౌన్, జూలై 7: పెన్షన్‌దారులకు అండగా నిలబడినందుకు సీపీఎం నాయకుడు, పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కామినేని రామారావు మీద టీడీపీ నాయకుల దాడి అప్రజాస్వామికమని, దాడి చేసి గాయపర్చిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం ఇంటింటికి సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తే పల్నాడు జిల్లా పగటిదర్ల టీడీపీ నాయకుడు చిగురుపాటి ఆదినారాయణ తన ఇంటి వద్దకు లబ్ధిదారులు రావాలని గ్రామంలో చాటింపు వేయడం వారిని తన ఇంటి చుట్టూ తిప్పుకోవడాన్ని ప్రశ్నించిన రామారావు మీద టీడీపీ నాయకులు దాడి చేశారన్నారు. గత వైసీపీ దాడిలో దెబ్బలు తిన్న టీడీపీ వారికి సీపీఎం అండగా నిలబడ్డ విషయాన్ని టీడీపీ గ్రహించాలన్నారు. అలాగే స్కీమ్ వర్కర్లను రాజకీయ కోణంలో చూడరాదన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా ఎక్కడ పేదలకు, ఉద్యోగులకు అన్యాయం జరిగినా వారికి సీపీఎం అండగా నిలబడి పోరాటాలు చేస్తుందన్నారు. ఇలాంటి దాడులతో సీపీఎం ఉద్యమాలను ఆపలేరని, దాడులు చేయడం మానుకొని ప్రజలకు మంచి పాలన అందించాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అబ్బవరం రామాంజులు, సీపీయం నాయకులు హరిశర్మ, మాధవయ్యలు పాల్గొన్నారు.

ఆటోనగర్‌కు స్థలాన్ని సాధించుకోవాలి

రైల్వేకోడూరు, జూలై 7: కూటమి ప్రభుత్వంలోనైనా ఆటోనగర్‌కు స్థలాన్ని సాధించుకోవాలని రైల్వేకోడూరు ఆటోనగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మెదూరు లోకనాథం ఆచారి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు బైపాస్ వద్ద ఆటోనగర్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్‌కు స్థలం కేటాయింపు విషయంలో ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చామని, అయినా ఇంతవరకు స్థలం కేటాయింపు జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోనగర్‌కు స్థలం కేటాయింపు జరిగే వరకు మన పోరాటం ఆగదని తెలిపారు. పోరాటంలో కార్మికులు అందరూ రాజీలేకుండా పోరాటాలు చేస్తున్నారన్నారు. ఆటోనగర్ కార్మికులు ప్రస్తుతం అద్దెలు చెల్లించుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని, చాలా మందికి పనులు లేక చాలీచాలని పనులతో ఇక్కట్లు పడుతున్నారన్నారు. ఇప్పటికే ప్రస్తుత కూటమి నాయకులకు ఆటోనగర్‌కు స్థలాన్ని కేటాయించి సాయం చేయాలని విన్నవించామని, కూటమి నాయకులు సానుకూలంగా స్పందించి స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు కేజీ ప్రసాద్, సలహాదారుడు వీఎల్ సేట్, ప్రధాన కార్యదర్శి మాబూబాషా, జాయింట్ కార్యదర్శి జి.గంగాధర్, కోశాధికారి సుబ్రహ్మణ్యం, సభ్యులు దాము, నెట్టికంఠయ్య, జయక్రిష్ణ, ఎల్‌జీ బాబు, హరయ్య, పి.భాను, సుధాకర్‌రాజు, ఖాదర్‌వల్లి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

రైల్వేకోడూరు(రూరల్), జూలై 7: పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు వెంబడి రాధాకృష్ణ, నగిరిపాటి చెంగయ్య ఆధ్వర్యంలో 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ 59వ పుట్టినరోజు సందర్భంగా భారీ కేకును కట్ చేసి అక్కడికి విచ్చేసిన ప్రతి కార్యకర్తలకు పంచిపెట్టారు. కూటమి విజయంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎమ్మార్పీఎస్‌లకు ఇచ్చి హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలి: సీఐటీయూ

రైల్వేకోడూరు, జూలై 7: నియోజకవర్గంలోని దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కారం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంచుకోవాలంటే గుంజన, ముష్టేరు, గుండలేరు తదితర నదుల వద్ద చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయాలన్నారు. కోడూరు-వెంకటగిరి రోడ్డును పూర్తి చేయాలన్నారు. మునక ప్రాంతాలైన నరసరాంపేట, వసంతనగర్, ధర్మాపురం తదితర ప్రాంతాలకు రక్షణగోడ నిర్మాణం త్వరగా చేపట్టాలన్నారు. పేదలకు వివాహాలు చేసుకునేందుకు టీటీడీ కళ్యాణ మండలాలను ఏర్పాటు చేయలని, 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చాలన్నారు. అనంతరాజుపేటలో అప్పాజ్యూస్ పరిశ్రమను తిరిగి ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు లింగాలగారి యానాదయ్య, మోడి సుబ్బరామయ్య, పి.జాన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ముస్లింల అభ్యున్నతే ధ్యేయం'

రాజంపేట, జూలై 7: ముస్లింల అభ్యున్నతి కోసమే మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ పనిచేయాలని రాజంపేట ముస్లిం మతపెద్ద షేక్ సిరాజుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం రాజంపేటలో జరిగిన ఎంపీజే కార్యవర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను ముస్లిం పేదలకు అందేవిధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎంపీజే రాజంపేట నియోజకవర్గ నూతన అధ్యక్షులుగా పి.మోసిన్‌ఖాన్, ఉపాధ్యక్షులు సయ్యద్ నిహాల్, ప్రధాన కార్యదర్శిగా షేక్ అబ్దుల్ రహిమాన్, సహాయ కార్యదర్శిగా అబ్దుల్ రహమాన్, కోశాధికారిగా షేక్ అలీ, మరికొంతమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మల్లాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

పుల్లంపేట జూలై 7: మండల పరిధిలోని రంగంపల్లె పంచాయతీలో గ్రామదేవత మల్లాలమ్మను ఆదివారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దర్శించుకున్నారు. రంగంపల్లె పంచాయతీలో 7 గ్రామాల ప్రజలు అమ్మవారికి ప్రతినిత్యం పూజలు చేస్తారు. ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీకి మొక్కు ఉండడంతో ఆమె ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి మల్లాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థుల కోరిక మేరకు మల్లాలమ్మ గుడి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ముక్కా వరలక్ష్మీని గ్రామస్తులు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీకే వెంకటసుబ్బారెడ్డి, రెడ్డయ్యరెడ్డి, నరసింహారెడ్డి, శివకుమార్, రామిరెడ్డి, ధర్మారెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి ప్రసాద్, జనసేన నాయకులు వెంకటరమణ, రొంపిచర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

యల్లమ్మ జాతరలో కూటమి నాయకులు

ఓబులవారిపల్లె, జూలై 7: మండలంలోని మంగళంపల్లి పంచాయతీలో యల్లమ్మతల్లి జాతర సందర్భంగా గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జనసేన నాయకులు



మంత్రి దుర్గేశ్‌ను కలిసి చర్చిస్తున్న కోడూరు నాయకులు

రైల్వేకోడూరు, జూలై 7: రాష్ట్ర టూరిజం, సినీ ఫోటోగ్రఫీ శాఖ మంత్రి దుర్గేశ్‌ను ఆదివారం విజయవాడలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ నాయకులు పగడాల వెంకటేష్, జోగినేని మణి, ఎంపీటీసీ సభ్యులు వరికూటి నాగరాజు, నాయకులు పగడాల చంద్రశేఖర్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరామన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. పర్యాటకంగా రైల్వేకోడూరును అభివృద్ధి చేయవచ్చని తెలిపామన్నారు. రైల్వేకోడూరులో జనసేన పార్టీ విజయం సాధించడం, గత రాజకీయాలు, ప్రస్తుత రాజకీయాలను మంత్రితో కోడూరు నాయకులు చర్చించారు.



తిరుమల కొండపై వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ సోదాలు వేగవంతంగా చేస్తోంది. ఐదేళ్లలో విమర్శలొచ్చిన వాటిపైనే కాకుండా ప్రతి విభాగాన్నీ తనిఖీ చేయడంతోపాటు అక్కడి అధికారులు, సిబ్బందిని, బదిలీపై వెళ్లిన వారినీ ప్రశ్నిస్తున్నారు. గతంలో తీసుకున్న నిర్ణయాలు, నిధుల జారీ వంటి వాటిపై ఆరా తీసి.. స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తూ.. ముఖ్యమైన ఫైళ్లను స్వాధీనం చేసుకుంటున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలపై విజిలెన్స్

వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సోదాలు

టీటీడీలో మొదలైన ప్రకంపనలు

గత సీఎం జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో టీటీడీలో తీవ్రస్థాయిలో అవినీతి కుంభకోణాలు జరిగాయనే విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని, వ్యవస్థలను నాశనం చేశారంటూ ఆగ్రహించారు. తిరుమల నుంచే ప్రక్షాళన మొదలు పెడతామని ప్రకటించారు. ఈక్రమంలో 15 రోజులుగా ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన స్టేట్ విజిలెన్స్ కమిటీ.. టీటీడీలో సోదాలు చేయడంతో ప్రకంపనలు మొదలయ్యాయి. సీనియర్ ఎస్పీ కరీముల్లా ఆధ్వర్యంలో దాదాపు 40 మంది సభ్యులతో కూడిన స్టేట్ విజిలెన్స్ బృందం టీటీడీలోని అన్ని విభాగాలను తనిఖీ చేస్తోంది.

టికెట్లపైనే ఫోకస్

శ్రీవారి ఆర్జితసేవా టికెట్లు, వైసీపీ నాయకులకు కేటాయించిన వీఐపీ బ్రేక్, ప్రొటోకాల్ దర్శనాలను పరిమితికి మించి ఎవరికి ఎన్ని ఇచ్చారనే అంశంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇప్పటికే తిరుమలలోని ఈవో కార్యాలయంలో విజిలెన్స్ బృందం పలుమార్లు తనిఖీ చేసి.. ఇద్దరు ముఖ్య అధికారుల స్టేట్‌మెంట్‌ను తీసుకున్నారు. అలాగే కేటాయింపులకు సంబంధించిన పలు ఆధారాలను కూడా సేకరించినట్టు సమాచారం. మరోవైపు వైకుంఠం కాంప్లెక్స్ వద్దనున్న ఆర్జితం కార్యాలయంలోని ఐటీ విభాగంలోనూ సోదాలు చేశారు. ప్రభుత్వం మారిన వెంటనే రికార్డులను తారుమారు చేశారనే ఆరోపణలు ఉన్న క్రమంలో స్వయంగా వెళ్లి డేటాను పొందినట్టు తెలుస్తోంది. అలాగే శ్రీవాణి ట్రస్టు ద్వారా కేటాయించే టికెట్ల కౌంటర్లను కూడా తనిఖీ చేశారు. రోజుకు ఎన్ని టికెట్లు ఇస్తున్నారు, ఎంత నిధులు వస్తున్నాయి, అవి ఏ ఖాతాలో పడుతున్నాయనే అంశాలపై ఆరా తీశారు. శ్రీవారి అన్నప్రసాదాలు, లడ్డూల తయారీకి కొనుగోలు చేస్తున్న ముడి సరుకుల కొనుగోళ్లలో అక్రమాలు, నాణ్యత ప్రమాణాలు పరిశీలించాల్సిన అధికారికి అర్హత ఉందా, లేదా, క్వాలిటీ కంట్రోల్ వింగ్, ల్యాబ్ టెస్టింగ్, హెల్త్ అధికారుల తీరును పరిశీలించి ముఖ్య అంశాలను నమోదు చేశారు. ఎస్టేట్ విభాగం ద్వారా అతిథిగృహాల నిర్మాణం, దుకాణాల లైసెన్స్ రెన్యువల్స్, నగదు బ్యాంకు లావాదేవీలు, డిపాజిట్లు, ఆభరణాల భద్రత, టీటీడీ బోర్డులో టేబుల్ అజెండాగా పనులకు నిధుల మళ్లింపు వంటిపైనా పరిశీలన చేశారు.

ఇంజనీరింగ్ పనులపై..

వైసీపీ ప్రభుత్వంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి.. కమీషన్ల కోసం నిబంధనలను ఉల్లంఘించి మరీ భారీగా ఇంజనీరింగ్ పనులకు నిధులు మళ్లించారనే ఆరోపణలున్నాయి. దాంతో స్టేట్ విజిలెన్స్ బృందం ప్రత్యేకంగా ఇంజనీరింగ్ విభాగంలో సోదాలు చేసింది. ఏ పనులకు నిధులు కేటాయించారు, నిజంగా నిధులు కేటాయించాల్సిన అవసరముందా, ఎంత కేటాయించారు, నిజంగానే కమీషన్లు పొందారా వంటి వాటిపై కూడా విజిలెన్స్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కోట్లాది రూపాయల పనులను కొందరికే కట్టబెట్టడం, ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు,గత బోర్డు సభ్యులకు ఎలాంటి సంబంధాలు ఉన్నాయి వంటి అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది.

కీలక విభాగాల్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు

తనిఖీలు, రికార్డుల స్వాధీనం, స్టేట్‌మెంట్ల సేకరణతో ఐదేళ్లపాటు టీటీడీలోని కీలక విభాగాల్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నాయకులు, ఉన్నతాధికారులు బాగానే ఉన్నారని, తమకు ఏ ఆపద వస్తుందో తెలీక సతమతమవుతున్నారు. మాజీ ఈవో ధర్మారెడ్డికి సన్నిహితంగా ఉండి.. ప్రతి ఫైల్‌ను ముందుకు నడిపించిన అధికారులు ఇప్పుడు విజిలెన్స్ సోదాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నట్టు సమాచారం.

ప్రక్షాళన దైవానుగ్రహం

టీటీడీలో జరిగిన అవినీతి అక్రమాలపై కొరడా ఝళిపించేలా సీనియర్ అధికారులతో రాష్ట్రం ప్రభుత్వం ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేయడం దైవానుగ్రహం. దీనికి శ్రీవారి భక్తుడిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మాజీ ఈవో ధర్మారెడ్డి కార్యాలయం కేంద్రంగా దందా నడిపించిన అధికారుల వ్యవహారంపై, ఆదాయానికి మించిన ఆస్తుల సంపాదన, సమగ్ర సమాచార పత్రాలను ఆదివారం విజిలెన్స్ ఎస్పీకి అందజేశా. ఐదేళ్లలో ధార్మిక సంస్థకు జరిగిన నష్టాన్ని వివరించా. గతంలో నేను పంపిన సమాచారం ఆధారంగానే సీఎం చంద్రబాబు విజిలెన్స్ బృందాన్ని పంపారు. ధర్మారెడ్డికి సంబంధించిన కొందరు భజనపరులు రికార్డులను మాయం చేసే కుట్రలు చేస్తున్నారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరా. కొంతమంది అధికారులు, అధికారపార్టీ నాయకులు సొంత లాభాల కోసం ఇంజనీరింగ్ విభాగంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయల టెండర్లు పిలవడంలో కీలకపాత్ర పోషించిన సూత్రధారులు, పాత్రధారుల వివరాలను విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లా.

- నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

జిల్లాకు విశ్వవిద్యాలయం తీసుకొస్తా : ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల

చిత్తూరు రూరల్, జూలై 7: చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ అధ్యక్షతన ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాకు విశ్వవిద్యాలయాన్ని తీసుకొస్తానని స్పష్టంచేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తామన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. టిడ్కో ఇళ్లనిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహకరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీని నాయకులు సన్మానించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం ఇన్‌చార్జ్ మునిరత్నం నాయుడు, మాజీ మేయర్ కఠారి హేమలత, రాష్ట్ర అధికారప్రతినిధి సురేంద్రకుమార్, రాధేయ్ కన్‌స్ట్రక్షన్ అధినేత రాధేయ్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణ, నాయకులు సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్, సీఎంటీ త్యాగరాజన్, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



యుగంధర్ (ఫైల్ ఫొటో)

నింద్ర, జూలై 7: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నింద్ర మండలం శ్రీరామపురంలో ఆదివారం వెలుగుచూసింది. గ్రామస్తుల వివరాల మేరకు.. శ్రీరామపురం గ్రామానికి చెందిన బెల్లం యుగంధర్(52) తనకున్న ఒకటిన్నర ఎకర పొలంలో నీటి కోసం ఐదు బోర్లు వేశాడు. నీరు పడలేదు. ఇందుకోసం రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. ఇతరతరా అవసరాల కోసం మరో రూ.5లక్షలు అప్పు చేశాడు. ఇందులో రూ.లక్ష పిచ్చాటూరు యూనియన్ బ్యాంక్ నుంచి లోన్ తీసుకోగా, మిగతావి ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకున్నాడు. పొలంపై ఆదాయం లేకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

39మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాల నిలుపుదల

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7: ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న కారణంగా 39మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ నెలలో కార్డుదారులకు సరుకులు సక్రమంగా అందించని కారణంగా వారి జీతాలను నిలిపివేస్తూ డీఎస్వో కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

మునీశ్వరుడి జాతర





ప్రత్యేక అలంకరణలో మునీశ్వరుడు, మునీశ్వరుడి ఉత్సవమూర్తి ఊరేగింపు

గుడుపల్లె, జూలై7: గుడుపల్లె మండలం పెద్ద బజనవాడలో ఆదివారం మునీశ్వరుడి జాతర జరిగింది. గ్రామ సమీపంలో మునీశ్వరుడి ప్రతిమ వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి.. పిండిదీపాలు వెలిగించి మొక్కుకున్నారు. పలువురు తలనీలాలు సమర్పించారు.

భక్త జన సంద్రంగా బోయకొండ





ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ, దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, జూలై7: బోయకొండ క్షేత్రం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. అమ్మవారికి ప్రీతికరమైన ఆషాఢ మాసం మొదటి ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. భక్తులు అధికసమయం క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఉదయం 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఒక్కరోజులో రూ.13,28,662 ఆదాయం.. అన్నదానం కోసం రూ.9500 విరాళం వచ్చాయి. ఇక కొండపై నుంచి రణభేరిగంగమ్మ ఆలయం వరకు వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆలయ ఈవో చంద్రమౌళి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), జూలై 7: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి దర్శనార్థం ఉదయం నుంచి వేలాదిగా భక్తులు కాణిపాక క్షేత్రానికి విచ్చేశారు. క్యూలు పూర్తిగా నిండిపోయి భక్తులు బయటనిలబడాల్సి వచ్చింది. స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తుల మధ్య ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు.

తోటకనుమలో మరో బాలికకు డెంగ్యూ

వివాహిత మృతిపై డీపీవో విచారణ





గ్రామంలో కొనసాగిస్తున్న వైద్య శిబిరం, తాగునీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

వి.కోట, జూలై 7: వి.కోట మండలం తోటకనుమలో మరో బాలిక డెంగ్యూ బారినపడ్డారు. గ్రామంలో జ్వరాల తీవ్రతపై 'జ్వరాలతో పడకేసిన తోటకనుమ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించారు. విష జ్వరాలపై తనకు నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో డీపీవో లక్ష్మి, ఎంపీడీవో గోవర్ధన్ తదితరులు గ్రామానికి చేరుకుని సమస్యపై ఆరా తీశారు. రెండు రోజుల కిందట జ్వరంతో స్వాతి మృతిచెందగా.. ఆమె కుటుంబీకులతో వీరు మాట్లాడారు. మృతురాలి ఎనిమిదినెలల కుమార్తె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మరోవైపు జిల్లా మలేరియా అధికారి, ఇతర వైద్యులు ఆదివారం వైద్యశిబిరం కొనసాగించారు. ఇప్పటికే చాలా మంది బాధితులు ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు గుర్తించారు. ఏఎన్‌ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బందితో కలసి గ్రామంలో ఇంటింటా జ్వరాలపై సర్వే చేపట్టారు. జ్వరంతో మృతి చెందిన స్వాతి ఇంటికి.. పక్కింట్లో ఉన్న 14 ఏళ్ల బాలికకు జ్వరం అధికం కావడంతో శనివారం రాత్రి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. డెంగీ అని తేలడంతో ఆమెను కుప్పానికి తరలించారు. ఇప్పటికీ గ్రామంలో చాలా మంది జ్వరంతో పడకేశారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మందులు అందజేశారు. అపరిశుభ్రంగా ఉన్న తాగునీటి ట్యాంకును గ్రామస్తుల సహకారంతో బాగు చేశారు. పైప్‌లైన్ లీకేజీలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతు చేశారు. వారంలో ఓ రోజు డ్రై డేగా పాటించాలని, మురుగు నీటి కాలువలను శుభ్రం చేసుకోవాలని కార్యదర్శిని డీపీవో ఆదేశించారు. జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరం కొనసాగించాలని సూచించారు.

జే న్యూటౌన్ ఆక్రమణలు తొలగించండి: సీపీఐ



చెరువు మొరవను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పుంగనూరు, జూలై7: పుంగనూరు బైపాస్ రోడ్డులో మాజీ ఎమ్మెల్యే ఎన్.శ్రీధర్‌రెడ్డికి చెందిన జేన్యూటౌన్ వెంచర్‌లో గత ప్రభుత్వంలో జరిగిన ఆక్రమణలు తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా సహాయకార్యదర్శి టి.జనార్దన్ డిమాండు చేశారు. బైపాస్ రోడ్డులోని గుడిసిబండ పంచాయతీ తీగలమ్మ చెరువు మొరవను ఆదివారం వీరు పరిశీలించారు.మొరవలో వెంచర్‌కు సంబంధించిన పైపులు పూడ్చడానికి నీటిపారుదల శాఖ అధికారులు అనుమతించడంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. మొరవ కుదించడంతో వర్షపు నీరు పుంగనూరులోకి చేరి జలమయమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్‌హెచ్, ఇరిగేషన్ చెరువు మొరవ దురాక్రమణ జరిగినా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పుంగనూరు మండలం భీమగానిపల్లె, సుగాలిమిట్ట పంచాయతీల్లో వైసీపీ నాయకులు కుంటలు, చెరువులు, ప్రభుత్వ భూములు, దేవదాయశాఖ భూములు ఆక్రమించుకుని ప్లాటుగా మార్చి అమ్మేశారని ఆరోపించారు. ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సీపీఐ నాయకులు రామ్మూర్తి, గురవయ్య, మోహన్ పాల్గొన్నారు.

రుయాలో స్టాఫ్‌నర్సుపై రోగి దాడి

తలపై తీవ్రగాయం



బాధితురాలికి చికిత్స చేస్తున్న సిబ్బంది

తిరుపతి(వైద్యం), జూలై 7: స్టాఫ్ నర్సుపై ఓ రోగి దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి తిరుపతిలోని రుయాస్పత్రిలో జరిగింది. మదనపల్లె మండలం రాజానగర్‌కి చెందిన దుర్గాప్రసాద్ విషం తాగడంతో నాలుగు రోజుల కిందట కుటుంబీకులు రుయాకు తీసుకొచ్చారు. ఇక్కడి ఏఎంసీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. శనివారం నాటికి కోలుకున్న అతనికి రాత్రి అట్రాసిన్ అనే ఇంజక్షను వేశారు. అప్పటినుంచి మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిలా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇదే వార్డులోకి స్టాఫ్‌నర్సు యశోద విధులకు హాజరయ్యారు. రోగులకు ఇంజక్షన్లు వేసి.. తన కుర్చీలో కూర్చొన్నారు. ఆ సమయంలో దుర్గాప్రసాద్ వెనుక నుంచి ఐవీ స్టాండు తీసి తలపై బలంగా కొట్టాడు. ఆమెకు తీవ్రగాయమైంది. గమనించిన సెక్యూరిటీ వచ్చి అతడిని పట్టుకుని పక్క గదిలోకి తీసుకెళ్లారు. బాధితురాలికి వైద్యులు ఎనిమిది కుట్లు వేయాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ రవిప్రభు వచ్చి.. ఘటనపై విచారణ చేపట్టారు. తొలుత వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చినా రోగికి మతిస్థిమితం లేదనే కారణంతో ఫిర్యాదు చేయలేదు. అయితే ఈ విషయం బయటకు రానీయకుండా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, తమకు రక్షణ లేకుండా పోయిందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీనిపై సోమవారం అధికారులను నిలదీసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది.

పంట రుణాలు.. మరింత ఆలస్యం!

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7: ఎన్నికలు.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడం తదితర కారణాలతో పంట రుణాలు మరింత ఆలస్యం కానున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు ఐదు లక్షల మంది రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం పంట రుణాలను అందిస్తుంది. కొత్తప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, సహకార బ్యాంకుల పాలక మండళ్లు రద్దయ్యాయి. కొత్త పాలకవర్గాలను నియమించాకే పంటరుణాలపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ జూన్ నుంచే ప్రారంభమైంది. ఇప్పటికే వాణిజ్య, గ్రామీణ, సహకార బ్యాంకుల్లో పంటరుణాల మంజూర్లు చురుగ్గా కొనసాగాలి. ప్రస్తుతం ప్రధాన బ్యాంకుల్లో ఏ బ్యాంకు ద్వారా కూడా పంటరుణాలు అందలేదు. ఈ సంవత్సరం పంటరుణాల మంజూరుకు సంబంధించి జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల, జిల్లా అధికారులు ఫిబ్రవరి నెలలో సమావేశమై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా ఖరారు చేశారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఆమోదానికి పంపారు. అక్కడినుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా వివిధ మార్పుల తర్వాత ఎన్నికలకు ముందే జిల్లాకేంద్రానికి చేరింది. ఎన్నికల కోడ్, ఫలితాల విడుదల, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, కలెక్టర్ల బదిలీలు తదితర కారణాలతో ఈ జాబితాపై నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. 2023-24లో రూ.13వేల కోట్ల పంటరుణాల పంపిణీకి బ్యాంకర్ల కమిటీ లక్ష్యం నిర్ణయించగా, రూ.14వేల కోట్ల పంపిణీ జరిగినట్లు బ్యాంకువర్గాలు తెలిపాయి. ఈ సంవత్సంలో పంట రుణాల లక్ష్యంపై త్వరలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం జరిపి నిర్ణయం తీసుకుంటామని ఎల్డీఎం ఎ.హరీష్ ఆదివారం తెలిపారు.

డీసీసీబీ లాభం రూ.9.65 కోట్లు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7: చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కు గతేడాది రూ.9.65 కోట్లు నికరలాభం వచ్చిందని సీఈవో మనోహర్ గౌడ్ తెలిపారు. ఇటీవల బ్యాంకు లావాదేవీలపై నిర్వహించిన ఆడిట్‌లోని ఈ వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. గత ఏడాది షేర్ కేపిటల్ రూ.80 కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.87 కోట్లకు పెరిగాయన్నారు. డిపాజిట్లు కూడా 2022-23లో రూ.853 కోట్లు ఉండగా, 2023-24లో రూ.932 కోట్లకు పెరగ్గా.. వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.1100 కోట్లకు పెంచాలని తీర్మానించామన్నారు. లోన్స్ ఔట్‌స్టాండింగ్ రూ.1563 కోట్ల నుంచి రూ.2002 కోట్లకు చేరిందన్నారు. అన్నిరకాల రుణాలు గతఏడాది రూ.1560కోట్లు పంపిణీ చేయగా, ఈసారి రూ.2000కోట్లకు పెంచామని, రానున్న ఆర్థిక సంవత్సరం రూ.2500కోట్లు అందించాలని నిర్ణయించామని వివరించారు. ఈ ఏడాది కొత్త పల్లిమిట్ట, కలకడ, కలికిరి, వడమాలపేట, పెద్దమండ్యం ప్రాంతాల్లో నూతన శాఖల ప్రారంభానికి అనుమతి కోసం దరఖాస్తు చేశామన్నారు.

'అమరావతి' నిర్మాణానికి రూ.30వేల విరాళం



శ్రీరంగరాజపురం, జూలై 7: రాజధాని అమరావతి కోసం పద్మాపురం గ్రామ పంచాయతీకి చెందిన మహిళా సంఘాలు రూ.30వేలు అందించాయి. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో టీడీపీ సీనియర్ నాయకుడు మాధవ నాయుడుకు అందించారు. ఈ కార్యక్రమంలో సీసీ మునేంద్ర, వీవో మేనక, వీవో అధ్యక్షురాలు చెంచమ్మ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల దినం

చిత్తూరు, జూలై 7: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే చిత్తూరు పాత డీపీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం ఉంటుందని ఎస్పీ మణికంఠ తెలిపారు.

విజిలెన్స్ దాడుల్లో రూ.4.28 లక్షల ఎరువులు సీజ్



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బి.కొత్తకోట, జూలై7: బి.కొత్తకోట పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించి రూ.4.28 లక్షల విలువైన ఎరువులను సీజ్ చేశారు. అగ్రికల్చర్ కమిషనరేట్ గుంటూరు వారి ఆదేశాల మేరకు సాల్‌రెడ్డి ఏడీఏ కర్నూల్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ రామక్రిష్ణలతో కూడిన అధికారుల బృందం పట్టణంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో ఎరువులు, పురుగుమందుల విక్రయాలు, నిల్వలకు సంబంధించిన రికార్డులు, బిల్లులను పరిశీలించగా యంవీఆర్ సీడ్స్ దుకాణంలో అమ్మకాలు, బిల్లులు సరిగా లేని కారణంగా రూ.4.28 లక్షల విలువైన ఎరువులను సీజ్ చేసి దుకాణ లైసెన్స్‌ను 15 రోజులపాటు సస్పెండ్‌లో ఉంచారు. అదే విధంగా బాలాజి ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు చేయగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఒకే దుకాణంలో విక్రయించడం నిబంధనలకు విరుద్ధమని గుర్తించి 16.9 టన్నుల ఎరువుల నిల్వలకు సంబంధించి తేడాలు ఉండటంతో ఈ షాపు లైసెన్స్ రద్దుకు జిల్లా వ్యవసాయ అధికారులకు సిఫారసు చేస్తున్నట్టు సాల్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఏవో ఆఫీస్ ఏవో వెంటమోహన, బి.కొత్తకోట ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుర్రంకొండలో: ప్రభుత్వ అనుమతులు లేకుండా విక్రయి స్తున్న ఎరువులను కర్నూలు వ్యవసాయ సహాయ సంచాలకులు సాలు రెడ్డి ఆదివారం సీజ్ చేసినట్లు తెలిపారు. గుర్రంకొండ పట్టణంలో పలు ఎరువుల దుకాణదారులు నకిలీ ఎరువులను విక్రయిస్తున్నట్లు రైతులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎరువుల దుకాణాలపై తనిఖీ చేశారు. ఇందులో పుడమి కిసాన్ మార్ట్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా విక్రయిస్తున్న ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి 1.59 మెట్రిక్ టన్నుల స్టాక్‌ను సీజ్ చేశారు. అధికారులు సీజ్ చేసిన ఎరువుల విలువ రూ.1.92 లక్షలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణ నాయక్, ఏవో వెంకటస్వామి, నవీన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకే ఎరువులను విక్రయించాలి

కురబలకోట, జులై 7: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలను విక్రయించాలని కర్నూల్ ఏడీఏ సాలురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అంగళ్ళులో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ఎరువుల అమ్మకాలు చేపట్టాలని, అలా కాకుండా నకిలీ ఎరువులు విక్రయాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు స్టాక్‌కు సంబంధించి రికార్డుల నమోదుతో పాటుగా బిల్లులు సక్రమంగా ఉంచాలని పేర్కొన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రామ కృష్ణానాయక్, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు

భార్యపై భర్త కత్తితో దాడి

మదనపల్లె అర్బన్,జూలై7:భార్యపై భర్త కత్తితో దాడిచేసి గాయపర్చిన ఘటన ఆదివారం మదనపల్లె పట్టణం చౌడేశ్వరీనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీనగర్‌కు చెందిన ఎస్‌ఆర్ దుర్గ (28) భర్త భాస్కర్ నాయుడుకు ఇద్దరు సంతానం ఉన్నారు. భర్త ప్రతి రోజు మద్యం తాగి భార్యపై తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం భర్త వేధింపులపై భార్య దుర్గ ఫిర్యాదు చేయడంతో టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయింది. అప్పటి నుంచి భర్త కుటుంబబాధ్యతలు పట్టించుకోకుండా కేవలం పిల్లలను చూసేందుకు మాత్రమే అప్పుడప్పుడు వచ్చేవారు. దుర్గ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. కాగా ఆదివారం మద్యంతాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. ఆవేశంతో ముందుగానే తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్యపై దాడికి పాల్పడాడు. ఈ సంఘటనలో దుర్గ తలపై తీవ్రగాయం అయింది. గమనించిన స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ సర్వజన బోధన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు టూటౌన్ ఎఎస్‌ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూలై 7: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ వలిబసు తెలిపారు. సీఐ వివరాల మేరకు మదనపల్లె పట్టణం,గాంధీపురంకు చెందిన ఓ బాలిక (17) ఆదివారం ఇంటి నుంచి చిల్లర అంగడికి వెళ్లి తిరిగి ఇంటి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెంది స్థానికంగా, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి కానరాకపోవడంతో వన్ టౌన్ పోలీసుల స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో వన్‌టౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకోండి

ములకలచెరువు, జూలై 7: తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని టీడీపీ నేతలు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. చిన్నమండ్యం మండలం బోడిరెడ్డిగారిపల్లెలో ఆదివారం మంత్రిని కలిసి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. టీడీపీ యువ నాయకులు చిటికె శివారెడ్డి, గాండ్ల శివ, సోషియల్ మీడియా కో ఆర్డినేటర్ కొండ్రెడ్డి అశోక్ తదితరులున్నారు.

అలరించిన దుర్యోధన వధ ఘట్టం



మదనపల్లె అర్బన్, జూలై 7: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని టిప్పుసుల్తాన్ మైదానంలో ఆదివారం మహాభారత యజ్ఞంలో భాగంగా నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం ప్రేక్షకులను అలరించింది. మహాభారత ఘట్టాన్ని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మదనపల్లె పట్టణంలో పురాణ ఇతిహాసమైన భారతాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందే భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. దుర్యోధనుడు కానంగి మడుగులో దాగిన సన్నివేశాన్ని అద్భుతంగా రక్తి కట్టించారు. భీముడు దుర్యోధనుడి మధ్య యుద్ధ సన్నివేశాన్ని ప్రజలు తిలకించారు. అనంతరం భక్తులు దుర్యోధనునిగా తీర్చిన బంక మట్టిని ఇళ్లకు తీసుకువెళ్లారు. ఈ మహాభారత యజ్ఞం గత 18 రోజులుగా మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు బీజేపి వెంకటేష్, డాక్టర్ రామచంద్రనాయుడు, వేల్పుల శ్రీధర్‌లు పర్యవేక్షించారు.

లక్ష్యం ఘనం... ఆచరణ శూన్యం

● మూలన పడ్డ కృషివికాస్ యోజన ట్రాక్టర్లు... రోటోవేటర్లు ● ప్రజాధనానికి తుప్పు ● నిర్వహణ కష్టమైందంటున్న అధికారులు



పీటీఎంలోని ప్రాథమిక సహకార బ్యాంకు ఆవరణలో మూలన పడిన ఆర్కేవీవై పథకం ట్రాక్టర్, రోటోవేటర్

పెద్దతిప్పసముద్రం జూలై 7: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల భాగస్వామ్యంతో గ్రామీణప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ఏర్పాటు చేసిన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. ఈ పథకం ద్వారా రైతులకు ఆర్థిక వెసులుబాటును కల్పించడమే ధ్యేయంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని ఆయా మండల కేంద్రాలకు ఇచ్చిన ట్రాక్టర్లు, రోటోవేటర్లు పత్తా లేకుండా పోయాయి. అక్కడక్కడా ఉన్నా ఓ మూలన తుప్పు పట్టి శిథి లావస్థలో దారుణ స్థితిలో ఉన్నాయి.

ఆర్‌కేవీవై ద్వారా ట్రాక్టర్ల పంపిణీ

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2007 లో ప్రారంభించింది. వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, పంటల ఉత్పాదకతను పెంచడం, రైతులకు ఆర్థిక, సాంకేతిక తోడ్పాటును అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గ్రామ స్థాయిలో రైతులకు వెసులుబాటు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో భాగంగా మన రాష్ట్రంలో 2013లో ప్రతి మండలానికి ఓ ట్రాక్టర్, రోటోవేటర్, మడకలను అందించారు. వ్యవసాయ శాఖ, సహకార శాఖ మండల స్థాయి సిబ్బందిని సమన్వయ పరచి, రైతులకు చేయూతనందించే విధంగా మార్గదర్శకాలు రూపొందించింది.

జరగాల్సింది ఇలా...

ప్రతి మండలానికి ఓ కొత్త ట్రాక్టర్, మడకలు, రోటోవేటర్ అందాయి. మండల వ్యవసాయాధికారి - సింగిల్ విండో సీఈవోల పర్యవేక్షణలో ట్రాక్టర్‌ను ఎటువంటి అద్దె, రుసుము తీసుకోకుండా రైతులకు వ్యవసాయ పనుల నిమిత్తం ఈ ట్రాక్టర్లను రైతులు కోరిన వెంటనే పంపాలి. ఇందుకోసం రైతులు రూ.వేలు వెచ్చించకుండా ఈ ట్రాక్టర్‌ను వినియోగించుకోవచ్చు. డీజల్ ఖర్చులు మాత్రం భరిస్తే చాలు. ట్రాక్టర్ అవసరమైన రైతులు సింగిల్ విండో కార్యాలయంలో సంప్రదిస్తే ట్రాక్టర్‌ను పంపే విధంగా విధి విదానాలను రూపొందించారు. ఈ ట్రాక్టర్ నిర్వాహణ ఖర్చులకు గాను ప్రతి నెలా రూ. 10 వేలు ప్రభుత్వమే ఇస్తుంది. ఇందుకోసం ఏవో, సీఈవో కలిసి జాయింట్ అకౌంట్ తెరవాలి. రైతులకు దరఖాస్తు ప్రాధాన్యతా క్రమంలో ట్రాక్టర్‌ను పంపుతారు. అయితే ఇవి ఏవి అమలు కాలేదు. మూన్నాళ్ల ముచ్చటగా ట్రాక్టర్లను ఓ ఐదారు నెలలు మాత్రమే వినియోగించారు. వ్యవసాయ, సహకార శాఖ అధికారులు బాధ్యత తీసుకోకపోవడంతో పథకం లక్ష్యం నెరవేరలేదు. క్రమక్రమంగా ట్రాక్టర్లు వ్యవసాయ పనులకు వాడటం ఆపేశారు, ఆ తరువాత మూలనపడ్డ ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు తుప్పుపట్టి పోయాయి.

ట్రాక్టర్ల నిర్వహణ కష్టమై నిలిపేశాం

ట్రాక్టర్ల నిర్వహణ అప్పట్లో కష్టమైంది. ప్రభుత్వం వేస్తామన్న నిధులు వేయలేదు. ట్రాక్టర్ దూర ప్రాంతాలకు పంపేందుకు అయ్యే డీజల్ ఖర్చు, డ్రైవర్ వేతనం, ఇతర మెయింటె నెన్స్ ఖర్చులు ఆరు నెలలకే రూ.లక్షకు పైగా సొసైటీకి ఖర్చు వచ్చింది. నిర్వహణ ఖర్చులు అధికంగా వస్తుండడంతో ట్రాక్టర్‌ను వినియోగించడం ఆగిపోయింది. కొంత కాలం తరువాత ట్రాక్టర్లను నిలిపేసి బ్యాంకు ఆవరణలో భద్రపరిచాం. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి నిర్వహణ ఖర్చులకు వేసే రూ. 10 వేలుకు అదనంగా డబ్బులు ఇస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది,

- చంద్రశేఖర్, సీఈవో పెద్దతిప్పసముద్రం సింగిల్ విండో

నగరం వద్దు..మేజర్ పంచాయతీ కావాలి

● బి.కొత్తకోటలో అఖిలపక్ష నాయకుల నిరసన



బి.కొత్తకోటలో నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, జూలై7:బి.కొత్తకోట పట్టణం నగరపంచాయతీగా వద్దు.. మేజర్ పంచాయతీగానే కొనసాగించాలని కోరుతూ ఆదివారం అఖిలపక్ష నాయకులు జ్యోతిసర్కిల్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యానర్ ను చేతపట్టి రోడ్డుపై రాస్తారోకో చేయడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. ఈ నిరసనలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ బి.కొత్తకోటను నగర పంచాయతీగా ప్రకటించడం తప్ప అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా మోసగించిందని ధ్వజమెత్తారు. ఎన్నికలు జరిపేందుకు ఏమాత్రం ప్రశ్నించలేదని, నగరపంచాయతీ ముసుగులో ఖాళీ స్థలాల ట్యాక్స్‌తోపాటు, ఇంటిపన్నులు, నీటిపన్నులు అమాంతం పెంచేసి ప్రజలపై పెనుభారం మోపారని ఆరోపించారు. మున్సిపాలిటీ స్థాయి సౌకర్యాలు లేనప్పుడు నగరపంచాయతీగా కొనసాగించడమే మంచిదని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్ని అన్యాయాలు చేసినా కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని, ఇప్పుడు ప్రభుత్వం మారింది కాబట్టి తమ గళాన్ని వినిపించే స్వేచ్ఛ వచ్చిందన్నారు. బి.కొత్తకోటను మేజర్ పంచాయతీగా కొనసాగించాలని సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్రిష్ణప్ప, మనోహర్‌రెడ్డి,రఘునాథ్, బషీర్ లతోపాటు సచిన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కుమారపురంలో మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 7: దివ్యాంగుల ఆత్మబంధువు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలతోపాటు ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాంతిసదన్ వృద్ధుల ఆశ్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు బియ్యం పంపిణీ చేసి కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కుమారపురం, బసినికొండ, రామారావు కాలనీల్లో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. ఇందులో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మౌలాలి, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఎస్.నరేంద్రబాబు వేర్వేరుగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ టౌన్ ఇన్‌చార్జి రాజా, వీహెచ్‌పీఎస్ ఉద్యోగుల విభాగం సంఘం నాయకులు జగదీష్, నాయకులు మధు, కుమార్, పద్మనాభం, సీవీ రమణ, వీహెచ్‌పీఎస్ నాయకులు స్టోర్ నాయుడు, ఈశ్వరీ, రెడ్డమ్మ, రాజంపేట అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, కౌన్సిలర్ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువులో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బస్టాండు సర్కిల్‌లో నియోజకవర్గ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్, ఎంఎస్పీ నియోజకవర్గ కో ఇన్‌చార్జి తిరుపాల్ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో గౌరవా ధ్యక్షుడు ఆది నారాయణ, నాయకులు తుడుం శ్రీరాములు, విజయ్‌కు మార్, నరసింహులు, అంజనప్ప, వెంకటస్వామి, రమణ, నారాయణ పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను తంబళ్లపల్లె మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటప్ప, వేటా మల్లికార్జున, భాస్కర్, జగదీష్, బొజ్జప్ప, గంగాధర, శివమణి టీడీపీ నాయకులు ఉత్తమ్‌రెడ్డి, సిద్దమ్మ, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు రామచంద్ర, చలపతినాయుడు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి 30వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ 59వ జన్మదిన వేడుకలను బి.కొత్తకోటలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంతోపాటు గట్టు, తుమ్మనంగుట్ట గ్రామాలలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీయస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్మ వెంకటేశ్వర్లు(చిన్నా), నాయకులు భవానీ వెంకటేష్, చౌడప్ప, రమణ, అంజి, రాముప్ప, శంకర, నరసింహులు, వెంకటేష్ పాల్గొన్నారు

కలికిరిలో: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 29 ఏళ్ళు పూర్తయి 30వ సంవత్సరంలోకి చేరిన కారణంగా మండలంలోని కె.కొత్తపల్లెలో ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. మండల ఇన్‌చార్జి మంద గురుప్రసాద్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, చందు, శ్రీకాంత్ చిట్టి, సూర్యకుమార్, నవ్య, సమంత, వాణిశ్రీ, ఎర్రమ్మ, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: రామసముద్రం మండలంలోని ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో అదేవిధంగా మండలంలోని ఇతర 20మాదిగపల్లెలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చే సి, కేక్ కటింగ్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆరేటి వాసు, ఎంఎస్పీ పట్టణ ఇన్‌ఛార్జి వై.రాజా, కౌన్సిలర్ కె.ప్రసాద్‌బాబు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు రాయపేట రమణ, శ్రీరాములు, గొల్లపల్లె కె.వేణుగోపాల్, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు గంగాధర్, కొండప్ప రామారావు కాలనీ, మేస్త్రీ రమణ పాల్గొన్నారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూలై 7:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె సమీపంలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు.

ఘనంగా తొగట వీరక్షత్రియ సంఘం ప్రమాణ స్వీకారోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న తొగటవీరక్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్

మదనపల్లె అర్బన్, జూలై7: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో తొగట వీరక్షత్రియ సంఘం మదనపల్లె కార్యవర్గం ఆదివారం ఘనంగా ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ఇందులో తొగట వీరక్షత్రియ సంఘం మదనపల్లె అధ్యక్షుడుగా పురాణం చంద్రశేఖర్(ఉప్పు), కార్యదర్శిగా బండిపవన్‌కుమార్, ట్రెజరర్‌గా రామిశెట్టి రత్న మయ్య ప్రమాణ స్వీకారం చేశారు. గత కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఉప్పురామచంద్ర, రామిశెట్టి లోకేష్, ఎం.ప్రభాకర్‌లు నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా పూలతో అలంకరణలు చేసి చౌడేశ్వరీమాతకు విశేషపూజలు నిర్వహిం చారు. నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా అధిక సంఖ్య లో తొగట కులస్థులు కార్యక్రమంలో పాల్గొని వారిని పూలమాలతో, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యక్షులుగా రెడ్డయ్య, చౌడప్ప, వెంకటేష్‌ను నియమించారు.

తొగటవీర క్షత్రియ యువజన కమిటీ

స్థానిక నీరుగట్టువారిపల్లెకు చెందిన యువతను నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో యువజన అధ్యక్షుడుగా ఉప్పు శ్రీనివాసులు, కార్య దర్శిగా రామిశెట్టి జగదీష్, ట్రెజరర్‌గా బొమ్మిశెట్టి నరసింహులును ఎంపి క చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తొగటవీర క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్ నూతన కమిటీ సభ్యుల కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మోడెం వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు నీలకంఠ, చంద్రశేఖర్, బండినాగరాజ రామిశెట్టి ఆంజ నేయులు, కౌన్సిలర్లు ఎస్‌వీ రమణ, మందపల్లె వెంకటరమణ, ప్రెస్ వెంకటేష్‌బాబు, పురం వెంకటరమణ, కమల మరికృష్ణ, నాగరాజ, రమేష్ బాబు, లక్ష్మీనారాయణ, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు పురాణం వెంకటరత్నం, లక్ష్మీనారాయణ పాలొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



21 ఏళ్ళ తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, జూలై 7: మండలంలోని సోంపాళ్యంలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. సొంపల్లె జడ్పీ హైస్కూల్‌లో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మళ్లీ 21 ఏళ్ళ తరువాత ఇప్పుడు కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చదువుకున్న సమయంలో చేసిన అల్లరి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రస్తుతం స్థిరపడ్డ రంగాల గురించి చర్చించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు క్రిష్ణారెడ్డి, నాగరాజు, సతీష్‌కుమార్, శంకరప్ప, శంకరమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అజీంబాషా, ప్రభాకర్, నరసింహారెడ్డి, ముంజునాథ్, శ్రీనివాసులు, ప్రతాప్, కరీముల్లా, అరుణ్‌కుమార్, రాజశేఖర్, ముంతాజ్, శిల్ప, మీనాక్షి, పార్వతి, సరస్వతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెను గ్రీన్ సిటీగా రూపుదిద్దుతాం



ప్రశాంతనగర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, గురుప్రసాద్

మదనపల్లె టౌన్, జూలై 7: డివిజన్ కేంద్రమైన మదనపల్లె పట్టణాన్ని గ్రీన్ సిటీగా మార్చడానికి ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్, ఎస్‌బీఐ కాలనీలో జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లెలో ఈ ఐదేళ్లలో 50 వేల మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలను తానే తీసుకుంటున్నాన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం పట్టణంలో మొక్కలను నాటుతున్నామన్నారు. జ్ఞానాంబిక కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు ఒక మొక్కను నాటి సంరక్షిస్తే పట్టణంలో పర్యావరణ పరిరక్షణ చేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమదేవి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, విద్యార్థినులు పాల్గొన్నారు. మండలంలోని కురవంక పంచాయతీలో టీడీపీ నాయకుడు పి.మోహన, వినోద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కదిరిరోడ్డు పక్కన నిర్వహిస్తున్న మహాభారతం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాదికి రెండు సార్లు మహాభారతం నిర్వహణకు తనవంత సహాయం అందిస్తానన్నారు.

టీడీపీ నాయకుడికి ఎన్‌ఆర్‌ఐ లోకేశ్ ఆర్థిక సాయం



టీడీపీ నాయకుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న టీడీపీ ఎన్‌ఆర్‌ఐ లోకేశ్ కొణెదల

మదనపల్లె టౌన్, జూలై 7: మదనపల్లె టీడీపీ మైనారిటీ నాయకుడు అన్వర్ బాషాకు టీడీపీ ఎన్‌ఆర్‌ఐ లోకేశ్ కొణెదల రూ.25వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్ మాట్లాడుతూ మదనపల్లెలో టీడీపీ వీరాభిమాని అయిన అన్వర్‌బాషాకు ఇటీవల అనారోగ్యంతో ఒక కాలు శస్త్రచికిత్స చేసి తొలగించారన్నారు. ఆయనను ఆదుకోవాలని ఎన్‌ఆర్‌ఐ లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారన్నారు. దీంతో పాటు ఇటీవల జరిగిన ఎన్నికల్లో మదనపల్లెలో టీడీపీ గెలుపునకు ఇతోధికంగా లోకేశ్ సహాయ, సహకారాలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు పెరవలి నవీన్, ఐటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాటకొండ రాజేశ్, నిరంజన్‌నాని, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



కిశోర్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా వీఆర్‌ఏల సంఘం నాయకులు

కలికిరి, జూలై 7: దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా వీఆర్‌ఏల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఆమేరకు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డికి వారొక వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు ఆదివారం నగరిపల్లెలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. 2015 నుంచి ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో వున్న పే స్కేలు సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతమున్న వీఆర్వో ఖాళీల్లోకి ప్రమోషన్లతో వీఆర్‌ఏలను బదిలీ చేయాలన్నారు. 60 ఏళ్లు దాటిన వీఆర్‌ఏ స్థానాల్లో వారి నామినీలు పని చేస్తున్నారని వారందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. సమస్యలను సీఎంకు నివేదిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు కె.రామలింగా రెడ్డి, కలికిరి మండల శాఖ అధ్యక్షుడు నరసింహులు, కోశాధికారి టి.బాలరాజు, వీఆర్‌ఏలు మల్లికా ర్జున, ఎల్లారెడ్డి, వెంకటేశు, హరినాథ, అమరావతి, లక్ష్మన్న, సురేంద్ర, గీతారాణి పాల్గొన్నారు.

ఏడాది తరువాత తీరిన తాగునీటి సమస్య



చీకలబైలు గ్రామంలో ఏడాది తరువాత నీరు అందిస్తున్న బోరు

మదనపల్లె టౌన్, జూలై 7: మదనపల్లె మండలం చీకిలబైలు పంచాయతీ కేంద్రంలో ఏడాది తరువాత తాగునీటి సమస్య పరిష్కారమైంది. చీకిలబైలు గ్రామంలో 500 కుటుంబాలు నివశిస్తుండగా తాగునీటి సమస్య కారణంగా టీడీపీ సర్పంచ్ ప్రభాకర్ పంచాయతీ నిధులతో 1000 అడుగుల లోతు బోరు వేయించారు. కాని ఈ బోరుకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయడంలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులు రాజకీయం చేస్తూ అడ్డుపడ్డారు. దీంతో ఏడాదిగా ట్రాన్స్‌ఫార్మర్ బిగించక బోరు నిరుపయోగంగా ఉండిపోయింది. ఈ క్రమంలో చీకిలబైలు సర్పంచ్ ప్రభాకర్ ఈ విషయమై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకురాగా ఆయన ఎస్పీడీసీఎల్ అధికారులతో మాట్లాడటంతో రూ.2.40లక్షల పంచాయతీ నిధులతో బోరుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. ఎట్టకేలకు ఏడాది తరువాత తాగునీటి సమస్య పరిష్కారం కాగా ఆదివారం ఈ బోరు నుంచి గ్రామ ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు.

తైవాన్ ఇంటర్న్‌షిప్‌కు 10మంది మిట్స్ విద్యార్థులు



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన మిట్స్ విద్యార్థులు

కురబలకోట, జులై 7: తైవాన్‌లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆసియా యూనివర్సిటీ ఇంటర్న్‌షిప్‌కు 10 మంది మిట్స్ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం సీఎస్‌టీ విభాగానికి చెందిన విద్యార్థులు దాదాపీర్, సాయిమౌనీష్, సీఎస్‌ఈ విభాగానికి చెందిన ప్రణీత, సాయిస్ఫూర్తి, అమేయశ్రీ, ఏఐ విభాగానికి చెందిన ధనుష్‌రెడ్డి, అలీ సయ్యద్, డేటా సైన్స్ విభాగానికి చెందిన ఇందు, ఈశ్వర్‌శివాని, పూజితలు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు వారం రోజుల ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌లో నైపుణ్యాలు. టెక్నికల్ ప్రాజెక్ట్‌లో పరిశోధనలు చేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్, ఇంటర్నేషనల్ రిలేషన్ మేనేజర్ విజయలక్ష్మి, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి



జాతీయ రహదారిపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న పోలీసులు, న్యాయవాదులు

వాల్మీకిపురం, జులై 7: రహదారి ట్రాఫిక్ నియమాలను వాహనచోదకులు తప్పనిసరిగా పాటించాలని వాల్మీకిపురం అదనపు ఎస్‌ఐ కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గురుఅరవింద్ సూచనల మేరకు మదనపల్లె-తిరుపతి మార్గంలో రహదారిపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వాహన చోదకులు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చన్నారు. అలాగే వాహనాల రికార్డులు కూడా సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. రహదారి నియమాలను పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు వెంకటేశ్వరప్రసాద్, పారాలీగల్ వాలంటీర్లు, పోలీసులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



రాపూరివాండ్లపల్లె ఏటిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

పెద్దతిప్పసముద్రం జూలై 7 : మండలంలోని రాపూరివాండ్లపల్లె ఏటిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పీటీఎం ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం తమ సిబ్బందితో కలిసి ఏటిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పీటీఎం స్టేషన్‌కు తరలించామన్నారు. అనంతరం సాయంత్రం మొలకలచెరువు ఎస్‌ఈబి అధికారులకు ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసినట్లు పీటీఎం ఎస్‌ఐ పేర్కొన్నారు. ఎస్‌ఈబి అధికారులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌కు రూ. 10 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఈబీ సీఐ రామ్మోహన్ తెలిపారు.